PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 129 | విజయవాడ,శనివారం 10 డిసెంబర్ 2022 | 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 10 December 2022 | Rs

మైనార్టీల రిజర్వేషన్లను కాపాడతాం

- మళ్లీ దుల్హాన్ పథకం తీసుకొస్తాం
- అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్‌భూములు
- టిడిపి అధినేత చంద్రబాబు

లోపలి పేజీలో..

20 వరకు టెన్త్ ఫీజు గడువు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదోతరగతి పరీక్షల ఫీజును ప్రభుత్వ పరీక్షల విభాగం పొడిగించింది. ఈ నెల 20వ తేదీ వరకూ ఎలాంటి అపరాధ రుసుమూ లేకుండా చెల్లించొచ్చని డైరెక్టర్ డి దేవానందరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెగ్యులర్ విద్యార్థులు, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ రాసే విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టులలోపు రాసే విద్యార్థులు రూ.110, వొకేషనల్ విద్యార్థులు రూ.60 చెల్లించాలని వివరించారు. వయస్సు తక్కువ ఉన్న విద్యార్థులు రూ.300 చెల్లించాలని తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో 21వ తేదీ వరకు, రూ.200తో జనవరి రెండు వరకు, రూ.500తో జనవరి 9వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నామినల్ రోల్స్ పొందుపరచడం కూడా ఈ నెల 20వ తేదీలోపు చేయాలని పేర్కొన్నారు. దీనిని కూడా రూ.500 అపరాధం రుసుంతో జనవరి 9వ తేదీ వరకు నమోదు చేయవచ్చని తెలిపారు.

ముంచుకొచ్చిన మాండూస్



పుదుచ్చేరిలో అలల ధాటికి కూలిన ఇళ్లు

- తమిళనాడులో 3జిల్లాలకు రెడ్ అలర్ట్
- ఎపిలోనూ అప్రమత్తం
- రాత్రి 12 గం.కు తీరాన్ని తాకిన తుపాన్

ప్రజాశక్తి యంత్రాంగం

మాండూస్ తుపాన్ తమిళనాడును వణికిస్తోంది. తుపాన్ ప్రభావంతో దాదాపుగా ఆ రాష్ట్రమంతా ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాత్రి 12 గంటల ప్రాంతంలో చెన్నై సమీపంలోని మాముల్లాపురం వద్ద తుపాన్ తీరాన్ని తాకింది. తీరందాటే ప్రక్రియ 5 గంటల పాటు కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాన్ ప్రభావంతో చెన్నై నగరంలో కుండపోత వర్షం కురుస్తోంది. వాతారణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ తుపాన్ పర్యవేక్షణా కేంద్రాన్ని స్వయంగా పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. తీరం దాటే సమయంలో 89 నుండి 117 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండి హెచ్చరిచ్చడంతో తూర్పుకోస్ట్ రోడ్డుపై రాకపోకలను నిలిపివేశారు. తుపాన్ ప్రభావం పాండిచ్చేరిలోనూ తీవ్రంగా ఉంది. ఇక్కడ తీర ప్రాంతంలో సముద్రపు అలల తాకిడికి పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. తుపాన్ ప్రభావం దక్షిణకోస్తాకూడా తీవ్రంగా పడే ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ముందుజాగ్రత్తలు తీసుకుంటోంది.

మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్

తమిళనాడులోని చెంగలపట్టు, కాంచీపురం, విల్లుపురం జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను, మరో 9 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను ఇండియన్ మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండి) జారీ చేసింది.ఈ పన్నెండు జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దంటూ తమిళనాడు, పాండిచ్చేరిలలో హెచ్చరికలు జారీ చేశారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల హెచ్చరికల నేపథ్యంలో చెన్నై నగరంలోని అన్ని పార్కులను, క్రీడా స్థలాలను మూసివేశారు. తప్పనిసరైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావద్దని సాధారణ ప్రజానీకానికి హెచ్చరికలు జారీ చేశారు.చెన్నై నగరంలోని ముంపు ప్రాంతాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని మొహరింప చేశారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరే 12 విమానసర్వీసులను ముందు జాగ్రత్త చర్యగా రద్దు చేశారు.

చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలో స్కూళ్లు, కాలేజీలకు సెలవులు

మాండూస్ తుపాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ముసురు అలుముకుంది. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాలో గురువారం రాత్రి నుంచే చలిగాలులు, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. తిరుపతి, తిరుమలలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. పలు చెట్లు నేలకూలాయి. రహదారుల్లో మోకాల్లోతు నీరు ప్రవహిస్తోంది. శ్రీవారి దర్శనం అనంతరం గదులకు వెళ్లే భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెండు కనుమదారుల్లో వెళ్లే వాహనదారులను తితిదే విజిలెన్స్ విభాగం అప్రమత్తం చేసింది. స్కూళ్లు, కాలేజీలకు కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి సెలవు ప్రకటించారు. తీరప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించడంతో పాటు రెండు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను తరలించారు. మత్స్యకారులు సముద్రపు వేటకు వెళ్లరాదని, వెళ్లిన వారిని తిరిగి రావాలని ఆదేశించారు. తుపాన్ నేపథ్యంలో అన్ని మండలాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. చిత్తూరులో 31 మండలాల్లోని పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 169 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా మిగతా 5లో

మళ్లీ విద్వేష మంటలు

- రాజ్యసభలో 'పౌరస్మృతి' ప్రైవేటు బిల్లు
- తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఏదో రూపంలో దేశంలో విద్వేష మంటలను రగిలించడానికి బిజెపి ప్రయత్నిస్తూనే ఉంది. తాజాగా రాజ్యసభలో బిజెపి ఎంపి కిరోడి లాల్ మీనా యూనిఫాం సివిల్ కోడ్-2020 (ఉమ్మడి పౌరస్మృతి) ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిని వ్యతిరేకిస్తూ సిపిఎం, ఐయుఎంఎల్, ఎండిఎంకె నోటీసులు ఇచ్చాయి. బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. శుక్రవారం రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధంఖర్ అనుమతి ఇవ్వడంతో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు ఓటింగ్ కోసం డిమాండ్ చేశాయి. ఓటింగ్ నిర్వహించడంతో బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 63 ఓట్లు, వ్యతిరేకంగా 23 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేత ఎలమరం కరీం మాట్లాడుతూ ప్రజలకు రక్షణ ఇచ్చే అనేక రాజ్యాంగ అంశాలను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధపడటం లేదని, అదేసమయంలో ఇటువంటి వివాదాస్పద అంశాలను ముందుకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. సిపిఎం ఎంపి బికాష్ రంజన్ భట్టాచార్య మాట్లాడుతూ భారతదేశ నిర్మాణం భిన్నత్వంలో ఏకత్వమనే తత్వంతో ముడిపడి ఉందన్నారు. ఎండిఎంకె నేత వైకో మాట్లాడుతూ మైనార్టీ ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. సిపిఎం ఎంపిలు వి.శివదాసన్, జాన్ బ్రిట్టాస్ ఎఎ రహీం, ఐయుఎంఎల్ నేత అబ్దుల్ వాహాబ్ తదితరులు మాట్లాడారు. ఈ బిల్లును కాంగ్రెస్, ఎస్‌పి, సిపిఐ, డిఎంకె, టిఎంసి, ఆర్‌జెడి, ఎన్‌సిపి పార్టీలు కూడా వ్యతిరేకించాయి.

అమ్మి తీరుతాం...!

విశాఖ ఉక్కుపై కేంద్రం ప్రకటన

లావాదేవీలపై కసరత్తు : దీపమ్ సెక్రటరీ



న్యూఢిల్లీ : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజానీకం చేస్తున్న ఆందోళనను కేంద్ర ప్రభుత్వం బేఖాతరు చేస్తోంది. తాజాగా విశాఖ ఉక్కు ప్లాంటును అమ్మితీరుతామని ప్రకటించింది. శుక్రవారం జరిగిన సిఐఐ గ్లోబల్ ఎకనామిక్ సమ్మిట్‌లో కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ తూహిన్ కాంత్ పాండే

మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. 'రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ (విశాఖ స్టీల్ ప్లాంట్)ను అమ్మి తీరుతాం. ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదు.' అని ఆయన అన్నారు. విశాఖ స్టీల్‌లో 100 శాతం వాటాల విక్రయానికి 2021 జనవరిలోనే కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రక్రియను ముందుకు తీసుకు వెళ్లే పనిలోనే తాము ఉన్నామన్నారు. అమ్మకానికి వీలుగా లావాదేవీల ప్రక్రియ ఎలా ఉండాలన్న అంశంపై ప్రస్తుతం కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న ప్రభుత్వ రంగ సంస్థల వాటాల ఉపసంహరణ లక్ష్యాన్ని 2023 మార్చి ముగింపు నాటికి చేరుకోనున్నామని చెప్పారు.రూ.65వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని చేరడానికి త్వరలోనే హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్‌ఎల్)లోని వాటాలను ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్‌ఎస్) ద్వారా విక్రయించనున్నామన్నారు. మరికొన్ని సిపిఎస్‌యుల్లోనూ వాటాల ఉపసంహరణ ఉంటుందన్నారు.

ఐడిబిఐ బ్యాంక్ బిడ్ల స్వీకరణకు గడువు పెంపు

ప్రభుత్వ రంగంలోని ఐడిబిఐ బ్యాంక్ ప్రయివేటీకరణకు సంబంధించిన బిడ్ల స్వీకరణ గడవును కేంద్రం పొడిగించే అవకాశం ఉందని సమాచారం. ఇందులోని 60.72 శాతం వాటాల విక్రయానికి గాను ప్రాథమిక బిడ్ల స్వీకరణ డిసెంబర్ 16తో గడువు ముగియనుంది. దీన్ని నెల రోజుల పాటు పొడిగించి.. జనవరి మధ్య నాటికి బిడ్లను స్వీకరించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఐడిబిఐలో ఎల్‌ఐసి, ప్రభుత్వానికి సంయుక్తంగా 94.71 శాతం వాటా ఉంది. ఈ బ్యాంక్‌లోని మెజారిటీ వాటాలను విదేశీ కంపెనీలకు కట్టబెట్టడానికి వీలుగా ఇటీవల మోడీ సర్కార్ నిబంధనలను సవరించింది.

రైతు బిక్కుబిక్కు

- ఖరీఫ్ పంట కోతలు..రబీకి సన్నద్ధం
- తుపానొస్తే భారీ నష్టమే




లోపలి పేజీలో..

అంగన్‌వాడీ ఫెడరేషన్

అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ఉషారాణి, సింధు

75 మందితో కమిటీ



ఉషారాణి



సింధు



అంజుమణి

మధురై : మధురై : ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఎఐఎఫ్ఎడబ్ల్యుహెచ్) అఖిల భారత నూతన కమిటీ 75తో ఏకగ్రీవంగా ఎన్నికైంది. తమిళనాడులోని మధురైలో ఈ నెల 6 నుంచి జరుగుతున్న 10వ మహాసభ శుక్రవారం ముగిసింది. ఫెడరేషన్ అఖిల భారత అధ్యక్షులు ఉషారాణి, ప్రధానకార్యదర్శిగా సింధు, కోశాధికారిగా అంజుమణి ఎన్నికయ్యారు. వీరితో పాటు 25 మంది ఆఫీస్ బేరర్లు, 50 మంది వర్కింగ్ కమిటీని మహాసభ ఎన్నుకుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి అఖిల భారత ఉపాధ్యక్షులుగా బేబిరాణి, కార్యదర్శిగా సుబ్బరావమ్మ, వర్కింగ్ కమిటీ సభ్యులుగా వాణిశ్రీ, సుప్రజ, నాగశేషు ఎన్నికయ్యారు.



7 నెలల్లో బిఎస్‌ఎన్‌ఎల్ 5జి

న్యూఢిల్లీ : వచ్చే 5 నుంచి 7 మాసాల్లో బిఎస్‌ఎన్‌ఎల్‌లో 5జి సేవలు అందుబాటులోకి రానున్నాయని కేంద్ర టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సిఐఐ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత 4జి టెక్నలాజీ కలిగిన టవర్లను 5జికి ఆధునీకరిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 1.35 లక్షల బిఎస్‌ఎన్‌ఎల్ టవర్లను 5జికి మారుస్తామన్నారు. ఇతర ఏ టెలికం కంపెనీలకు లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు విస్తరించి ఉన్నాయన్నారు. దేశ టెలికం రంగంలో బిఎస్‌ఎన్‌ఎల్ పాత్ర బలంగా, స్థిరంగా ఉందన్నారు.

సమాన హక్కుల కోసం పోరాటం

- మహిళా రిజర్వేషన్ సాధించాలి
- ఐద్వా వజ్రోత్సవ సభలో పుణ్యవతి



సిద్ధార్థలో జరిగిన ఐద్వా వజ్రోత్సవ సభలో మాట్లాడుతున్న పుణ్యవతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కుల కోసం పోరాడాలని ఐద్వా కోశాధికారి ఎస్ పుణ్యవతి పిలుపునిచ్చారు. పార్లమెంట్లో పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ చేసేందుకు ఉద్యమించాలని కోరారు. సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగిన మహిళా సంఘం వజ్రోత్సవ సభలను శుక్రవారం పుణ్యవతి ప్రారంభించి మాట్లాడారు. మహిళల హక్కుల కోసం అచ్చమాంబ, మానికొండ సూర్యావతి వంటి వారు ఉద్యమాలు నిర్వహించారని, మనువాద సిద్ధాంతాలను ఎదిరించి నిలబడ్డారని తెలిపారు. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, జ్యోతిబా పూలే, సావిత్రిపూలే వంటి వారు మహిళా ఉద్యమ నాయకులకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. ఎన్నో ఉద్యమాలు, ఎంతోమంది మహనీయుల కృషితో మహిళా ఉద్యమం అభివృద్ధి అయిందన్నారు. సమాజంలో అనేక మార్పులూ వచ్చాయని చెప్పారు. ఆడపిల్లలు చదువుకుంటున్నారని, ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్లు గడిచినా మహిళలు ఇప్పటికీ గడప దాటాలంటే భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం మహిళలు, పురుషులకు సమాన హక్కులు కల్పించిందని, ప్రస్తుతం ఈ హక్కులు ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జాతీయోద్యమంలో మహిళలు ముఖ్యపాత్ర పోషించారని చెప్పారు. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. ప్రస్తుత రాజకీయాల్లో మహిళల పాత్ర తక్కువగా ఉందన్నారు. సాధారణ మహిళలు కూడా రాజకీయ రంగాల్లో రాణించాలని కోరారు. అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెండింగ్‌లో ఉందన్నారు. ఈ బిల్లుకు బిజెపి, కాంగ్రెస్‌తో పాటు మరికొన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నారు. పురుషాధిక్యం వల్ల మహిళా ప్రజాప్రతినిధులు బాధ్యతల నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశాలు నిర్వహణలో భర్తలు పెత్తనం చెలాయిస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. ఇందులో ఐద్వా ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి ప్రభావతి, శ్రామిక మహిళా నాయకులు దయా రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి పాల్గొన్నారు. 'విద్య-ఆరోగ్య రంగాలు-స్త్రీ' అనే అంశంపై రిటైర్డ్ రీడర్ ఇన్ ఎకనామిక్స్ మిగతా 5లో

ప్రభుత్వాల విధానాలే పేదలకు నష్టం

- బలమైన సంఘ నిర్మాణమే సమస్యలకు పరిష్కారం
- వ్యకాస రాష్ట్ర మహాసభలో విజయరాఘవన్



సభలో మాట్లాడుతున్న విజయరాఘవన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తోన్న విధానాలతో పేదలు నష్టపోతున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు విజయ రాఘవన్ అన్నారు. గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం బలమైన నిర్మాణం కలిగి ఉంటేనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ రెండోరోజు శుక్రవారం జంగారెడ్డిగూడెం శివారులోని దండమూడి రామలక్ష్మి కల్యాణ మండపంలో ప్రారంభ సభ జరిగింది. తొలుత సంఘం సీనియర్ నాయకులు పాటూరి రామయ్య జెండావిష్కరణ చేశారు. అనంతరం అమరవీరులకు నివాళులు అర్పించారు. ఆహ్వానసంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ స్వాగతోపన్యాసం చేశారు. విజయరాఘవన్ ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ.. పేదలు, కూలీలు, దళితులతో మమేకమై వారి సమస్యలపై పోరాడి గ్రామీణ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఢిల్లీలో రైతాంగ పోరాటమే మనందరికీ స్ఫూర్తి అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగాన్ని తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కేరళ, పశ్చిమబెంగాల్‌లో వామపక్షాలు భూ పంపిణీ చేశాయన్నారు. ఇక్కడ మాత్రం పేదల భూములను లాగేసుకుంటున్నారని, దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రయోగశాలగా ఉందని తెలిపారు. దేశంలో మతోన్మాద బిజెపి పాలన సాగుతోందని, కార్పొరేట్ భాగస్వామ్యంతో ప్రజలను విభజిస్తున్నారని తెలిపారు. రాజకీయాల్లో ధనప్రభావం పెరిగిపోయిందని, అవినీతి సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం పోరాటం చేయాల్సి ఉందన్నారు. భూసమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేయాలని, దీనిపై మహాసభ తీర్మానం చేయాలని సూచించారు. ఆంధ్రాకు ఉద్యమ వారసత్వం ఉందని, కేరళ వచ్చి సుందరయ్య ఉద్యమ నిర్మాణం చేశారన్నారు. పాటూరు రామయ్య రాసిన 'ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమ చరిత్ర' పుస్తకాన్ని విజయరాఘవన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్, కేరళ అగ్రికల్చర్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ చంద్రన్, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, పూర్వపు నేత మంతెన సీతారాం, నాయకులు పాల్గొన్నారు.


35 చిట్‌ఫండ్ కంపెనీల్లో

అవకతవకలు

- రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజి రామకృష్ణ

టాప్ 500లో 20 భారత కంపెనీలు

- హురున్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడి



ఇద్దరు రైతుల ఆత్మహత్య

లోపలి పేజీలో..

ఇళ్లకు నీటి మీటర్లు

- అమృత్ సంస్కరణల్లో భాగం
- 33 నగరాల్లో అమలుకు ప్రణాళిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించినట్టుగానే, ఇళ్లలోనూ నీటి మీటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి ప్రాథమిక కసరత్తు ఇప్పటికే పూర్తయింది. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఈ దిశలో చర్యలు కూడా ప్రారంభమైనాయి. మిగిలిన కార్పొరేషన్లలో కూడా సాధ్యమైనంత త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్రంలో లక్షలమందికి పైబడి నివాసం ఉంటున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని ఇళ్లలో నీటి మీటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా 33 నగరాలు, పట్టణాలు నీటిమీటర్లు ఉనికిలోకి రానున్నాయి. ఇప్పటికే చెత్తపన్ను, ఆస్తిపన్ను పెంపుతో సతమతమౌతున్న పట్టణవాసులకు నీటి మీటర్ల ఏర్పాటు మరింత అదనపు భారం కానుంది.

ఇప్పుడే ఎందుకు?

అప్పుల కావాలన్నా, ఎఫ్ఆర్‌బిఎం నిబంధనలు సడలించాలన్నా నీటమీటర్లను బిగించి తీరాలని కేంద్రం నిబంధన విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశలో చర్యలు ప్రారంభించింది. ప్రపంచ బ్యాంకు సంస్కరణల అమల్లో భాగంగా ప్రారంభించిన జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం పథకాన్ని బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత అమృత్(అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) పేరుతో కొనసాగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలోనే అమృత్, స్మార్ట్ నగరాలను ఎంపిక చేశారు. అప్పుల కోసం వైసిపి ప్రస్తుతం అమలు చేస్తోంది.

పెను భారమే...

అమృత్ పథకంలో ప్రతి కుటుంబానికి రోజుకు 135 లీటర్ల పరిమితి విధించారు. అంతకు మించి వాడుకుంటే జరిమానా విధించనున్నారు. దీనికి సంబంధించిన విధి విధానాలను అమృత్ 2.0లో స్పష్టంగా పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో నాన్ రెవెన్యూ వాటర్ వినియోదగాన్ని 20 శాతానికి తగ్గాలని అందులో షరతు విధించారు. 2009లోనే విజయవాడ నగరంలో 2.54 లక్షల నీటిమీటర్లు బిగించాలని అంచనా వేయగా సిపిఎం, ప్రజా సంఘాలు పెద్దఎత్తున అడ్డుకున్నాయి. అయితే వాణిజ్య, అపార్టుమెంట్లకు మీటర్లు బిగించేశారు. అనంతరం ప్రతి ఇంటికీ నీటి కనెక్షన్ మిగతా 5లో

న్యూస్ పేపర్లు కొనుగోలుకు నెలకు రూ.200

ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్లు అత్యధిక సర్క్యులేషన్ ఉండే న్యూస్ పేపర్ల కొనుగోలుకు నెలకు రూ.200 చొప్పున 2023 మార్చి వరకూ మంజూరు చేస్తూ గ్రామ, వార్డు సచివాలయాలశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా న్యూస్ పేపర్ ఓచర్ డిడిఓకు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు న్యూస్ పేపర్లు కొనుగోలు చేయడం ఉపయోగపడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై దుష్ప్రచారం తగదు

ఆర్థిక మంత్రి బుగ్గన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడాన్ని మానుకోవాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు, ఐఎఎస్‌లకు వేతనాలు ఇవ్వడం లేదనేది పూర్తిగా అబద్ధమని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం వెనక్కు తీసుకుందనేది కూడా అవాస్తవమని పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హాయంలో కన్నా వైసిపి పభుత్వ హాయంలో ఎక్కువ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. రోజుకు సగటున రూ. 400 కోట్ల నుండి 450 కోట్ల వరకూ ఖజానాకు జమ అవుతోందని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

తహాశీల్దార్ శ్రీనివాసరావు మృతిపై విచారణ : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు తహాశీల్దార్ శ్రీనివాసరావు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. శ్రీనివాసరావు బలవన్మరణం బాధాకరమని, ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

చదువుకోమంటే దళిత మహిళపై కేసు పెడతారా ?

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాడిపత్రి వైసిపి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, అతని కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి, డిఎస్‌పి చైతన్య కక్షగట్టి ఒక దళిత మహిళ కమలమ్మపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చదువురాని ఎమ్మెల్యేను చదువుకోమని చెప్పినందుకు ఎట్రాసిటీ కేసు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. పెద్దారెడ్డి, ఆయన కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి అరాచకాలు తారాస్థాయికి చేరాయని విమర్శించారు. చదువులేని వాడు వింత పశువు అనడానికి పెద్దారెడ్డే నిదర్శనమని పేర్కొన్నారు. వైసిపి నాయకులు ఆడమన్నట్లు డిఎస్‌పి చైతన్య ఆడుతూ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. గతంలోనూ అనేకమంది టిడిపి కార్యకర్తలు, నాయకులపై చైతన్య అక్రమ కేసులు బనాయించారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వచ్చాకా చట్టాలను ఎలా అమలు చేయాలో నేర్పుతామని తెలిపారు. కేతిరెడ్డి ఇకనైనా సామాన్యులపై తన ప్రతాపం చూపడం మాని బుద్ధిగా నడుచుకోవాలని, లేదంటే భవిష్యత్‌లో ప్రజలు తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు.

వారాహి బదులు నారాహి బాగుంటుంది

మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల ప్రచారం కోసం తీసుకున్న తన వాహనానికి వారాహి బదులు నారాహి అని నామకరణం చేసుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన మీడియతో మాట్లాడారు. వైసిపి నిర్వహించిన జయహో బిసి మహాసభతో తెలుగుదేశం, జనసేనకు వణుకు మొదలైందని విమర్శించారు. 2024లో వైసిపి సృష్టించే సునామీలో కుప్పంలో చంద్రబాబునాయుడు కొట్టుకుపోక తప్పదని అన్నారు. రాష్ట్రంలో వివిధహోదాల్లో వున్న బిసిల ప్రతినిధులు 84 వేలమంది జయహో బిసి మహాసభకు తరలివచ్చారని అన్నారు.

రైతు బిక్కుబిక్కు

- ఖరీఫ్ పంట కోతలు
- రబీకి సన్నద్ధం
- తుపానొస్తే భారీ నష్టమే



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

'మాండౌస్' తుపాను హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. తుపాను ఎపి దక్షిణకోస్తా, తమిళనాడు ఉత్తరకోస్తా మధ్య తీరం దాటుతుందన్న వార్తలతో తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లా రైతాంగం ఆందోళనగా ఉంది. మిగిలిన దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల్లో సైతం వచ్చే రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయనడంతో పంటలను కాపాడుకునేందుకు నానా యాతన పడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటలకు కోతల సమయం. రబీ సాగుకు సన్నద్ధమవుతున్న వేళ. కీలక సమయంలో తుపాను రావడంతో రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు.

వరి గండం

ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం చేతికొచ్చే ప్రధాన ఘట్టం. కాగా రెండు రోజుల నుంచి వాయుగుండం, తుపాను అంటుండటం, శుక్రవారం నుంచి వానలు మొదలు కావడంతో పంటలను కాపాడుకొనేందుకు యుద్ధ ప్రాతిపదికన వరి కోతలు చేపట్టారు. ఒకేసారి కోతలనడంతో యంత్రాలద్వారా కోతలు సాగించే దగ్గర రైతుల అవసరాన్ని అడ్డం పెట్టుకొని మిషన్ అద్దెలు విపరీతంగా పెంచేశారు. గంటకు ఎకరానికి రూ.వెయ్యి- రెండు వేలు ఉన్నది కాస్తా మూడు వేలు, అంతకుమించి వసూలు చేస్తున్నారు. ఒక్కో దగ్గర అంత పెట్టుకున్నా మిషన్లు అందుబాటులో లేవు. మిషన్లకూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. కోతలు హడావిడిగా పూర్తి చేసినా ధాన్యం కొనే పరిస్థితి లేదు. ఆర్‌బికెలలో ముందస్తు రిజిస్ట్రేషన్లు, కూపన్ల తతంగం ఉండనే ఉంది. అప్పటి ధాన్యం అప్పుడు అమ్మబోతే తేమ శాతం నిబంధన అడ్డంకిగా మారింది. ఆర్‌బికెలలో స్టోరేజి సదుపాయాల్లేవు. ఆర్‌బికెల వెలుపల కూడా ధాన్యాన్ని అమ్ముకోవచ్చని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులివ్వడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు, మధ్యవర్తులను విధిలేని పరిస్థితుల్లో ఆశ్రయిస్తున్నారు. తుపాను నేపథ్యంలో మొత్తానికే పంటను పోగొట్టుకునేకంటే 'వచ్చిందే దక్కుళ్లు' అని మద్దతు ధరలతో నిమిత్తం లేకుండా అయినకాడికి తెగనమ్ముకొని నష్టపోతున్నారు. చేలల్లో కోసిన వరి కంకులను, ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు, ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్ల కోసం వెతుకులాడుతున్నారు. ప్రభుత్వం కనీసం రైతులకు పట్టాలిచ్చేందుకూ ముందుకురావట్లేదు.

ఇతర పంటలకూ..

ఖరీఫ్ కందులు పూత దశ, గింజపట్టేదశలో ఉన్నాయి. పెసలు, మినుములు కోతకొచ్చాయి. రాయలసీమలో వేరుశనగ గింజ అభివృద్ధి దశలో, కోతలకు వచ్చింది. పత్తి రెండవ తీత దశలో ఉంది. చెరకు గడ వృద్ధి దశలో ఉంది. ఇంతకుముందు కురిసిన వర్షాలకు కొన్ని చోట్ల వరి, పత్తి, మిర్చి, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. కోతల సమయంలో భారీ వర్షాలు పడితే పంటలు నీటిపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక రబీ సాగుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. వరి నారుమళ్లు పెరుగుతున్నాయి. చాలా చోట్ల నాట్లు వేస్తున్నారు. శనగ, మినుము, పెసలు, మొక్కజొన్న విత్తనాలు వేస్తున్నారు. రబీలోనూ సాగు పుంజుకోలేదు. సీజన్‌లో రెండు మాసాలు పూర్తయినా 28 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. దాదాపు అన్ని పంటలూ తగ్గాయి. ఈపాటికే శనగ సాగు దాదాపు పూర్తి కావాల్సి ఉండగా ఆ పంట సైతం తగ్గింది. లిఫ్టులు, బోర్లు, కొన్ని ప్రాజెక్టుల కింద రబీలో వరి సాగు చేయొద్దని ప్రభుత్వం సూచించడంతో రైతులు సందిగ్ధంలో పడ్డారు. ఇప్పుడు తుపాను అనడంతో వేసిన కొద్ది పంటలనూ నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులొస్తే ఉద్యానవన పంటలు, తోటలు, కూరగాయలకు నష్టమేనంటున్నారు.

తక్షణం ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని

12న పౌరసరఫరాల కార్యాలయం ముందు ధర్నా

- ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులు పండించిన ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఈనెల 12న విజయవాడ అశోక్‌నగర్లోని పౌరసరఫరాల కార్పొరేషన్ ఎమ్‌డి కార్యాలయం ముందు ధర్నాను చేపడతామని ఎపి రైతు సంఘం, కౌలురైతు సంఘం నాయకులు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, ఎం.హరిబాబు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని మాటిచ్చిన ప్రభుత్వం కొనుగోలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గోనెసంచులు లేవనే సాకుతో కొనుగోళ్లు ఆపడం తగదని విమర్శించారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు వద్దనే ధాన్యం మిగిలిపోయిందని, ఇపుడు తుఫాన్ హెచ్చరికలు రావడంతో తడిచిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సిసిఆర్‌సి కార్డులు లేవని ఈ క్రాపింగ్ కాలేదనే పేరుతో కౌలురైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని తెలిపారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం ధాన్యం కొనుగోళ్లను చేపట్టకపోతే ఈ నెల 12న పెద్దఎత్తున రైతులను సమీకరించి ధర్నాను చేపడతామని తెలిపారు.

మైనార్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ కార్యదర్శి భాటియా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైనార్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయడం ద్వారా మైనార్టీల అభ్యున్నతికి అన్ని విధాలా కృషి చేయాలని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ కార్యదర్శి భాటియా అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న మైనార్టీ సంక్షేమ పథకాలపై సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి జన్‌వికాస్ కార్యక్రమ అమలు, కేంద్రప్రభుత్వం అందిస్తున్న స్కాలర్‌షిప్పులు, జగనన్న విదేశీ విద్యాదీవెన, ఓవర్ సీస్ విద్యాస్కీం, వైఎస్ఆర్ షాదీతోఫాపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎఎండి ఇంతియాజ్, కమిషనర్ జిసి కిషోర్, అదనపు కార్యదర్శి బి రోజ్‌లతాభాయి, సహాయ కార్యదర్శి టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మైనార్టీల రిజర్వేషన్లను కాపాడతాం

- మళ్లీ దుల్హాన్ పథకం తీసుకొస్తాం
- అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్‌భూములు
- టిడిపి అధినేత చంద్రబాబు



గుంటూరు జిల్లా పొన్నూరులో మైనార్టీల ఆత్మీయ సమాశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/ బాపట్ల జిల్లా

ముస్లింల రిజర్వేషన్లు కాపాడే బాధ్యత తాను తీసుకుంటానని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇందుకోసం సుప్రీం కోర్టులో ముస్లింల తరుపున తాను పోరాడతానని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా పొన్నూరులో మైనార్టీలతో చంద్రబాబు ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 1985లోనే ముస్లింలకు మైనారిటీ కార్పొరేషన్ పెట్టామన్నారు. ఉర్దూను రెండో అధికారిక భాషగా చేశామని తెలిపారు. ముస్లిములు హజ్ యాత్రకు వెళ్లడం కోసం హైదరాబాద్‌లో హజ్ హౌస్ కట్టానని తెలిపారు. హైదరాబాద్ నుంచే యాత్రకు వెళ్లే అవకాశం కల్పించామని, హజ్ యాత్రకు ఆర్థిక సాయం కూడా చేశామన్నారు. హైదరాబాద్‌లో ఉర్దూ యూనిరవర్సిటీ పెట్టామని, విభజన తరువాత కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పది లక్షల మందికి రంజాన్ తోఫా ఇచ్చామని తెలిపారు. దుకాన్ మకాన్, దుల్హన్ పథకాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పెళ్లి కానుక కింద రూ.లక్ష ఇస్తామని చెప్పి... నిలిపివేశారని తెలిపారు. మంత్రి పదవులకు, నామినేటెడ్ పోస్టులకు విద్యార్హత ఉండదని, ముస్లిములకు దుల్హన్ పథకానికి పదో తరగతి విద్యార్హత నిబంధన పెట్టడం దారుణమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ దుల్హన్ పథకం తీసుకువస్తానని హామీ ఇచ్చారు. టిడిపి హయంలో మొదలు పెట్టిన మసీదులు, షాదిఖానాలు పూర్తి చేయలేదని, వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే ముస్తఫా వక్ఫ్ బోర్డు ఆస్తులను కొట్టేస్తున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి ఆటోమొబైల్ రంగంలోని వారంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యువతకు మన రాష్ట్రంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర, టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని బంగాళాఖాతంలో కలవడం ఖాయం

రాష్ట్రంలో సంక్షేమం లేదని.. సంక్షోభం మాత్రమే ఉందని, ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే రైతులు, బిసిలు, మైనార్టీల కోసం రానున్న ఎన్నికల్లో మన ప్రభుత్వం అధికారంలోకి రావాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. బాపట్లలోని అంబేద్కర్ సర్కిల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పది రూపాయలు ఇచ్చి.. వంద రూపాయలు దోచేస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసిపి బంగాళాఖాతంలో కలవడం ఖాయమని పేర్కొన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోనా అవినీతిని తేలుద్దామన్నారు. మీరు పోరాటానికి సిద్ధమా? అని ప్రశ్నించారు. సైకో పాలన వద్దు.. సైకిల్ పాలన రావాలి అని పిలుపునిచ్చారు.

వేధింపులతోనే తహాశీల్దార్ ఆత్మహత్య ?

- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండల తహాశీల్దారు ఒ.శ్రీనివాసరావు అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. విజయనగరంలోని కొత్తపేటలో కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అంత్యక్రియల్లో డిఆర్ఒ గణపతిరావు, పాడేరు జిల్లాకు చెందిన ఎస్‌డిసి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తాడ్డి గోవింద్, జిల్లాలోని పలువురు తహాశీల్దార్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పట్టణ పౌరసంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరావు పాల్గొన్నారు. తహాశీల్దార్ మృతికి కారణమైన పిఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయనగరానికి చెందిన శ్రీనివాసరావు అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు తహాశీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య లక్ష్మీ శివసరోజా, ఏడాదిన్నర వయసున్న కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావు రెవెన్యూ శాఖలో సుమారు 14 ఏళ్లగా పని చేస్తున్నాడు. కొన్ని నెలల క్రితమే పెదబయలు తహాశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. జగనన్న భూ సర్వే సహా పలు ప్రభుత్వ కార్యక్రమాల అమలులో తీవ్ర పని ఒత్తిడికి గురయ్యారు. ఇటీవల జగనన్న భూ సర్వేపై కలెక్టర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాల కృష్ణ తీవ్రంగా దుర్భాషలాడారు. అధికారుల సమక్షంలోనే దూషించారని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. పని ఒత్తిడిని ఎలాగోలా నెట్టుకొస్తున్నా... వేధింపులు వెంటాడడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని అతని సన్నిహితులు భావిస్తున్నారు.

సాయుధ దళాల సేవలు స్ఫూర్తిదాయకం

- గవర్నర్ విశ్వభూషణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాయుధ దళాలు సరిహద్దుల రక్షణకే పరిమితం కాకుండా దేశ అంతర్గత సమస్యలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నాయని, వారి సేవలు స్ఫూర్తిదాయకమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. రాజ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన సాయుధదళాల జెండా దినోత్సవంలో గరవ్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయుల ఆలోచనల్లో సాయుధ దళాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 7న జరుపుకుంటున్నామన్నారు. సాయుధ దళాల శౌర్యం, విధినిర్వహణ పట్ల అంకితభావం, అత్యున్నత స్థాయి వృత్తి నైపుణ్యం దేశానికి భిన్నరూపాల్లో సహాయకారిగా ఉందన్నారు. యుద్ధ క్షేత్రంలో ప్రత్యర్థులపై సమరభేరి మోగించి అత్యున్నత త్యాగాలతో స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నారన్నారు. మాతృభూమి రక్షణలో ఆత్మీయులను కోల్పోయిన వీరనారీమణులను ఈ సందర్భంగా సన్మానించడం అదృష్టమన్నారు. సైనికుల నుంచి యుద్ధం అత్యున్నత త్యాగాలను కోరుతోందని, కానీ వారి కుటుంబసభ్యులకు అపారమైన కష్టాలను తెస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. సాయుధ దళాల సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల పట్ల ప్రభుత్వాలు మరింత శ్రద్ధ వహించాలన్నారు. హోంశాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యుల సంక్షేమానికి ప్రభుత్వ తగిన ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ సంచాలకులు వెంకటరెడ్డి గవర్నర్‌కు పతాక దినోత్సవ స్టిక్కర్‌ను అందించారు. వీరనారులు ఐశ్వర్య, లక్ష్మీ, సత్యకళ, మమతతో పాటు నాయక్‌సుభాన్, గ్యాలంట్రీ అవార్డు పొందిన ఆంజనేయులు, రెండవ ప్రపంచ యుద్ధంలో పాలుపంచుకున్న నిమ్మగడ్డ నాగభూషణంను గౌరవించి ఒక్కొక్కరికీ రూ.25 వేలు నగదు పురస్కారాన్ని గవర్నర్ అందజేశారు. సాయుధ దళాల ప్రత్యేక నిధికి గవర్నర్ లక్ష రూపాయలు ఇవ్వగా, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో పాటు చలసాని బాబు రాజేంద్రప్రసాద్ లక్ష వంతున ఇచ్చారు. మిగిలిన అధికారులు మరో ఐదు లక్షల నిధిని సమకూర్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, హోంశాఖ కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపకార్యదర్శి నారాయణస్వామి, పశ్చిమగోదావరి జిల్లా సైనిక సంక్షేమ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

ఘనంగా కౌశల్ 2022 అవార్డుల ప్రధానం

గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కౌశల్ పోటీ పరీక్ష గొప్ప వేదికని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విజయవాడలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ వేదికగా శుక్రవారం నిర్వహించిన కౌశల్-2022 అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. "ఆజాదీకా అమృత్ మహోత్సవ్" జరుపుకుంటున్న తరుణంలో 2022 అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ విజ్ఞాన మండలి అధ్యక్షుడు పిఎస్ అవధాని, ఉపాధ్యక్షుడు ఆచార్య కైలాసరావు, కౌశల్ 2022 రాష్ట్ర కో ఆర్డినేటర్ డి.చంద్రశేఖర్, విజ్ఞాన భారతి జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు కెఎస్ శాస్త్రి, స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ఆచార్య రమేష్ పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

'ఉక్కు' పరిరక్షణకు సంఘటిత పోరు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



రానున్న కాలంలో విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు మరింత సంఘటితంగా పోరాటం నిర్వహించనున్నట్టు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 666వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, కో - కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు, నాయకులు జె రామకృష్ణ, దొమ్మేటి అప్పారావు, చిత్రాడ సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర, కె రాజబాబు మాట్లాడారు. ప్రభుత్వ రంగాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు సర్వనాశనం చేస్తోందని మండిపడ్డారు. బీమా రంగం, బ్యాంకులు, బిఎస్‌ఎన్‌ఎల్ వంటి సంస్థల్లో వాటాలను ఇష్టానుసారం అమ్ముతోందని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్ముతామని ప్రకటించడం దారుణమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉంటేనే కార్మిక వర్గానికి, నిర్వాసితులకు, నిరుద్యోగులకు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం నాయకులు వి రామకోటేశ్వరరావు, మంత్రి రవికిరణ్, సూర్యనారాయణ, విజయ్‌కుమార్, సుదర్శన్, సాయిరాం పాల్గొన్నారు.

35 చిట్‌ఫండ్ కంపెనీల్లో అవకతవకలు

రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఐజి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో 35 చిట్‌ఫండ్ కంపెనీల్లో అవకతవకలు ఉన్నట్లు గుర్తించామని, వీటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రామకృష్ణ తెలిపారు. చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం ప్రతి కంపెనీ ఆస్తులు, లయబిలిటీస్, ఖర్చులు, రిసీట్స్, ఇన్వెస్ట్‌మెంట్స్, రిజర్వు ఫండ్స్ వంటి ఆరు రకాల సమాచారాన్ని ప్రతి సంవత్సరం అందివ్వాలన్నారు. విజయవాడ ఈడుపుగల్లు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కమిషనరు అండ్ ఐజి కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అధికారులకు నిర్వహించిన వర్కుషాప్ అనంతరం మీడియాతో రామకృష్ణ మాట్లాడారు. మార్గదర్శి వివరణ ప్రకటనను పత్రికల్లో చూశామని, సమాచారం ఇవ్వకుండా ప్రకటనలిస్తే పరిగణలోకి తీసుకోలేమని రామకృష్ణ పేర్కొన్నారు. ఏ సంస్థయినా అవసరమైన సమాచారం ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ బిజినెస్ అక్కడ రికార్డులు ఇవ్వాలన్నారు, చిట్ కంపెనీలు సెక్యూరిటీ పేరిట డిపాజిట్లను సేకరించడం, వడ్డీ సరిగా చెల్లించకపోవడం, ప్రత్యేక బ్యాలెన్స్ షీట్లు నిర్వహించకపోవడం వంటి అంశాలు తనిఖీల్లో గుర్తించామన్నారు. మార్గదర్శిపై ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తామని, ఆడిటర్స్, ఫోరెన్సిక్ నిపుణులతో మార్గదర్శి హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లి తనిఖీలు చేస్తామని తెలిపారు. కంపెనీ ఫైనాన్సియల్ స్టేటస్ తెలుసుకోవడానికి వివరాలు అడిగామని, రాష్ట్రంలో బిజినెస్ చేస్తూ తెలంగాణ, కర్నాటకలో వివరాలు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో సహకరించాల్సిన బాధ్యత మార్గదర్శిపై ఉందని రామకృష్ణ తెలిపారు. చిట్‌ఫండ్ కంపెనీలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అధికారుల్లో చిట్ ఫండ్స్ చట్టంపై మార్గనిర్దేశకత్వం చేయడానికి వర్క్‌షాపు నిర్వహించామన్నారు. ఉల్లంఘనలను ఎలా గుర్తించాలి ? షోకాజు నోటీసు జారీ చేయడం, స్వాధీనం చేసుకున్న ఆస్తులను ఎలా ఆడిట్ చేయాలి ? చెక్ లిస్టు లాంటి అంశాలపై తరగతులు నిర్వహించామని తెలిపారు. నిపుణులైన ఆడిటర్లు, ఫోరెన్సిక్స్ ఆడిటర్లను సలహాదారులుగా నియమించుకున్నామని, డిఆర్ఐ నుంచి వచ్చిన అధికారులు అవగాహన కల్పించారన్నారు.



కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

- ఎపిసిసి నూతన అధ్యక్షులు రుద్రరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎపిసిసి నూతన అధ్యక్షులు గిడుగు రుద్రరాజు కోరారు. విజయవాడ బెంజిసర్కిల్‌లోని వేదిక కళ్యాణ మండపంలో శుక్రవారం నూతన పిసిసి కార్యకర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్లతో మాజీవర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసీరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో రుద్రరాజు మాట్లాడుతూ లోకల్ క్యాడర్‌ను కలుపుకుని పార్టీ నాయకులు ముందుకు సాగాలన్నారు. జగన్, చంద్రబాబు ఇద్దరూ స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారన్నారు. నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానని, త్వరలో ఉత్తరాంధ్రలో పర్యటిస్తానని తెలిపారు. కాంగ్రెస్ కోర్ కమిటీలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. ఎపిసిసి మాజీ అధ్యక్షులు శైలజానాథ్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో బయటకు వచ్చి పనిచేసింది కాంగ్రెస్ పార్టీయేనని, ఆ సమయంలో అనేక మంది కాంగ్రెస్ పార్టీ నాయకులను కోల్పోయిందని అన్నారు. తన హయాంలో ఎస్‌సిలను అత్యధికంగా జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమించానన్నారు.

మాజీమంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎపిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమవంతు సాయం అందిస్తామని తెలిపారు. గిడుగు రుద్రరాజు మంచి మనిషని, ఆయన నాయకత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపరచాలని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ నేత మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. వైఎస్ఆర్, కెవిపి రామచంద్రరావు తనతో పాటు రుద్రరాజును అనేక సందర్భాల్లో మార్గదర్శకత్వం చేశారన్నారు. వంగవీటి రంగా పేరును ప్రస్తావించకపోవడం పట్ల కొందరు కార్యకర్తలు ఆయన ప్రసంగానికి అడ్డుతగిలారు. సీనియర్ నేతలు కార్యకర్తలకు సర్దిచెప్పారు. రంగాను అందరూ గుర్తు చేసుకోవాలని ప్రతి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ ఎంపి కెవిపి రామచంద్రరావు, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపిలు జెడి శీలం, చింతా మోహన్, కనుమూరి బాపిరాజు, కొప్పుల రాజు, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, ఎఐసిసి జనరల్ సెక్రటరీ మరియప్పన్ ఒడిశా పిపిసి చైర్మన్ శరణ్ పట్నాయక్, విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, నాయకులు రాజీవ్‌రతన్, జంగా గౌతమ్, రాకేష్‌రెడ్డి, సుంకర పద్మశ్రీ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎస్‌సి, ఎస్‌టిలు రాణించాలి

- ఎస్‌సి, ఎస్‌టి సిసిఐ ఛైర్మన్ డేవిడ్ బ్రైనార్డ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని ఎస్‌సి, ఎస్‌టిలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలని ఎస్‌సి, ఎస్‌టి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జాతీయ ఛైర్మన్ డేవిడ్ బ్రైనార్డ్ కోరారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ఎస్‌సి, ఎస్‌టి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎపి చాప్టర్ ఎంట్రప్రెన్యూర్ సమ్మిట్‌కు ఆయన హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎపి అధ్యక్షులు రాజా మహేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్రైనార్డ్ మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టిలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. దేశంలో 730 జిల్లాల్లో ఎస్‌సి, ఎస్‌టి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ పనిచేస్తోందని తెలిపారు. వారి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని అన్నారు. సరైన ప్రణాళికలతో వెళితే సర్వీస్ రంగంలో రూ 75 లక్షలు, ఉత్పాదక రంగాల్లో కోటి రూపాయలదాకా సబ్సిడీలు అందే కార్యక్రమాలు వున్నాయని, బ్యాంకుల సహకారంతో ఈ ప్రాజెక్టులను సాకారం చేసుకునే అవకాశం వుందని తెలిపారు. ఈ సందర్భంగా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ జనరల్ మేనేజర్ సోమశేఖర్ మాట్లాడుతూ మార్కెట్, ఉత్తత్తుల్లో నాణ్యత ఈ రెండూ కీలకమైన అంశాలని అవి వుంటే బ్యాంకులు సహకరిస్తాయని అన్నారు. లిడ్‌క్యాప్ ఛైర్మన్ రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి,ఎస్‌టిల కోసం ఎన్నో కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి మరొకరు బలి

ప్రజాశక్తి- కనగానపల్లి (అనంతపురం)


హరి (ఫైల్)

విద్యుత్ షాక్‌కు మరొకరు బలయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలో ముత్తవకుంట్ల గ్రామానికి చెందిన ఈడిగ హరి (26) శుక్రవారం సాన్నం చేసేందుకు బాత్‌రూం తలుపుతీస్తుండగా విద్యుదాఘాతానికి గురై చనిపోయారు. ఆయన కియా కంపెనీలో రోజువారి కార్మికునిగా పని చేస్తున్నారు. గ్రామంలో కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, టీవీలు, ఫ్రిడ్జ్‌లు కాలిపోతున్నాయని విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

నవరత్నాల్లో భూపంపిణీ చేపట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో తీర్మానం
- నాలుగుతీర్మానాలు ఆమోదం


మహాసభ సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నేత పాటూరు రామయ్య

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో భూపంపిణీ చేర్చి దశరత్నాలుగా భూపంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ తీర్మానించింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న మహాసభలో శుక్రవారం నాలుగు తీర్మానాలను ఆమోదించారు. భూసమస్యపై తీర్మానాన్ని కృష్ణా జిల్లాకు చెందిన రాజేష్ ప్రవేశపెట్టగా, కడప జిల్లాకు చెందిన అన్వేష్ బలపర్చారు. ప్రజాపంపిణీ తీర్మానాన్ని నంద్యాలకు చెందిన ఎం.నాగేశ్వరరావు ప్రవేశపెట్టగా, చిత్తూరుకు చెందిన చిరంజీవమ్మ బలపర్చారు. దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులకు సంబంధించిన తీర్మానాన్ని ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కల్యాణ్ ప్రవేశపెట్టగా, తిరుపతికి చెందిన కె.గురవమ్మ బలపర్చారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సమగ్ర చట్టం చేయాలన్న తీర్మానాన్ని ఏలూరు జిల్లాకు చెందిన పివి.రామకృష్ణ ప్రవేశ పెట్టగా కర్నూలు జిల్లాకు చెందిన వీరశేఖర్ బలపర్చారు. భూసమస్య, పంపిణీకి సంబంధించిన తీర్మానంలో పలు డిమాండ్లను పేర్కొన్నారు. దున్నేవానికి భూమి అనే నినాదంతో వామపక్ష పార్టీలు, వ్యవసాయకార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన భూపోరాటాల ఫలితంగా ప్రభుత్వాలు అనివార్యంగా సెంటో, కుంటో పేదలకు భూపంపిణీ చేశాయని, అయితే నేటి ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో ఆ భూములను బలవంతంగా లాక్కుని కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు, భూస్వాములకు దారాదత్తం చేస్తున్నాయని విమర్శించారు.కోనేరు రంగారావు సిఫార్సుల ప్రకారం భూమిలేని ప్రతి కుటుంబానికీ రెండెకరాలు భూమి పంచాలని, పేదల సాగులో ఉన్న భూములకు, నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములకు 9-77 చట్టప్రకారం ఆక్రమణదారుల నుంచి తీసుకుని తిరిగి పేదలకు ఇవ్వాలని కోరారు. జిఒ నెం 250-2018 ప్రకారం అసైన్‌మెంట్ కమిటీలు పునరుద్ధరించి భూపంపిణీ చేపట్టాలని, ఆక్రమణదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని విజ్ఞప్తి చేశారు. 2013 భూసేకరణ, పునరావాస చట్టం ప్రకారం రైతుల నుండి ప్రభుత్వం తీసుకుంటున్న భూములకు మార్కెటు ధర కంటే నాలుగురెట్లు నష్టపరిహారం చెల్లించాలని, పునరావాస నిమిత్తం వయోజనులందరికీ, కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

1973 భూసీలింగ్ చట్టప్రకారం నీటిపారుదల సౌకర్యం కల్పించిన భూముల వర్గీకరణతో మార్పు తెచ్చి అదనపు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. పిడబ్ల్యూడి, ఆర్‌అండ్‌బి, ప్రభుత్వ పోరంబోకు భూములు, పంచాయతీ స్థలాల్లో భూస్వాములు 99 సంవత్సరాల లీజు పేరుతో అనుభవిస్తున్న లక్షలాది కొబ్బరి చెట్ల లీజును రద్దుచేసి దళితులకు, భూమిలేని నిరుపేదలకు కనీసం పది చెట్లు తక్కువ కాకుండా ఇవ్వాలని కోరారు. భూదాన ఉద్యమ భూములకు రాష్ట్ర ప్రభుత్వం ఒక బోర్డును ఏర్పాటు చేసి బినామీ పేర్లతో భూములను అక్రమించిన వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని, భూపంపిణీకి ప్రత్యేక రెవెన్యూ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణాల అభివృద్ధికి గ్రామీణ ప్రాంతాలను విలీనం చేసిన చోట అర్బన్ భూ సీలింగ్ చట్టాన్ని అమలు చేయాలనే పలు డిమాండ్లు తీర్మానంలో పొందుపరిచారు.

పోలీసు శాఖలో ఖాళీలు భర్తీ చేయండి

- వయో పరిమితిని 35కు పెంచండి
- సిఎంకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీస్ శాఖలోని ఖాళీ పోస్టులన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని, అదే విధంగా వయో పరిమితిని 35 సంవత్సరాలకు పెంచాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. పోలీస్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్ నాలుగు సంవత్సరాలుగా ఎస్సై. కానిస్టేబుల్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులక తీవ్ర నిరాశను కలిగించిందని ఈ లేఖలో పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే పోలీసు శాఖలో ఏడాదికి 6,700 పోస్టులు చొప్పున భర్తీ చేస్తామని వాగ్దానం చేశారని, లక్షలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నా నాలుగు సంవత్సరాలుగా నోటిఫికేషన్లు వెలువడలేదని తెలిపారు. దీనికోసం సన్నద్ధమైన వేలాదిమంది అభ్యర్థులకు వయోపరిమితి నిబంధన ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. నోటిఫికేషన్ జాప్యం వల్ల నిరుద్యోగులకు నష్టం జరుగకుండా వయోపరిమితిని 35 సంవత్సరాలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు శాఖలో సుమారు 35 శాతం పోస్టులు ఖాళీలు ఉన్నట్లు చెబుతున్నారని, వీక్లీ ఆఫ్ విధానం వల్ల 10 వేల మంది సిబ్బంది అదనంగా అవసరం కానుండగా, ప్రభుత్వం 6,100 కానిస్టేబుల్, 411 ఎస్సై పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. ఒక్క లా అండ్ ఆర్డర్‌లోనే కాకుండా ఫైర్, జైలు వార్డెన్ తదితర పోస్టులనూ భర్తీ చేస్తే ఎక్కువ మంది సిబ్బంది అవసరమవుతారని తెలిపారు. నాలుగేళ్లుగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తూ శిక్షణ తీసుకుంటున్న యువతకు న్యాయం చేసే విధంగా పోలీసు శాఖలోనున్న ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని కోరారు.

విలువలు కలిగిన జర్నలిజానికి బాటలు వేయాలి

- ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



నిజాలను నిజాయతీగా రాసినప్పుడే జర్నలిజంలో సంతృప్తి దొరుకుతుందని రాష్ట్ర ప్రెస్‌అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శుక్రవారం మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విలువలు కలిగిన జర్నలిజానికి బాటలు వేయాలని కోరారు. అసత్యాలు వల్లెవేస్తే అభద్రతతో మానసిక ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఏదైనా దురదృష్టకరమైన సంఘటన జరిగినప్పుడు బాధితులకు న్యాయం చేసే దక్పథంతో వార్తలు రాసినప్పుడే వారికి న్యాయం చేయగలుగుతామని తెలిపారు. బాషాపరంగా అవగాహనా సదస్సులు, ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెట్టడానికి ప్రెస్ అకాడమీ ఆలోచన చేస్తుందన్నారు. తొలుత ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపకులు వానపల్లి సుబ్బారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ సెక్రటరీ ఎం.బాలగంగాధర్ తిలక్, పాత్రికేయులు పాల్గొన్నారు.

ధాన్యం రవాణాకు లారీలు పంపండి

- తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు
- తుపాను నేపథ్యంలో కల్లాల్లోని ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి
- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన



ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా)

ధాన్యం రవాణాకు లారీలు పంపక కొనుగోలు ఆలస్యం కావడం, మరోవైపు తుపాను నేపథ్యంలో కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయి ఇబ్బందులు పడుతున్నామని జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం కల్లాల వద్ద అన్నదాతలు నిరసన వ్యక్తం చేశారు. తేమశాతం నిర్ధారణ, గోనె సంచుల కోసం కాళ్లకు చెప్పులు అరిగేలా తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల కల్లాల్లో ఉండిపోయిందన్నారు. బస్తాల్లోకి ఎక్కించిన ధాన్యాన్ని లారీల సమస్యతో తీసుకెళ్లకపోవడం వల్ల ఎక్కడికి అక్కడే ధాన్యం నిల్వ ఉండిపోయిందన్నారు. ఆర్‌బికెల్లో 17 శాతం వచ్చిన ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత తేమ శాతం ఎక్కువ ఉందని చెప్పి తరుగు పేరుతో రైతులు డబ్బు చెల్లించాలని కోరడం దారుణమని విమర్శించారు. తేమ శాతం తరుగుకు సంబంధించి డబ్బు చెల్లించకపోతే ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవడం లేదన్నారు. ఆర్‌బికెల్లోనే తేమశాతాన్ని ఫైనల్ చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చినిగిన గోనె సంచులు ఇస్తున్నారని, నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాలని అన్నారు. తుపాన్ వల్ల వర్షం కురిసి ధాన్యం తడిసిపోతే అందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలన్నారు.

ఈనెల 12న విజయవాడలోని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయం ముందు రాయబార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుసులూరి శ్రీహరి, నల్లబోతుల దుర్గారావు, మందపాటి గణేష్, పారేపల్లి సత్యనారాయణ, ఆళ్ల వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న నారాయణ

ఐక్య ఉద్యమాలు భవిష్యత్తుకు దిక్సూచి

- కడప ఉక్కు సాధన కోసం సిపిఐ పాదయాత్ర
- జమ్మలమడుగు నుంచి కడప వరకు యాత్ర

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

ఐక్య ఉద్యమాలు భవిష్యత్తుకు దిక్సూచిగా మారతాయని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె గ్రామంలోని కన్యతీర్థం వద్ద వైసిపి ప్రభుత్వం వేసిన శిలాఫలకం నుంచి కడప కలెక్టరేట్ వరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం పాదయాత్రను నారాయణ ప్రారంభించి మాట్లాడుతూ.. రాయలసీమ వెనుకబడిపోతుందని చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను నిర్మించుకోలేని పరిస్థితిలో ఉందన్నారు. ప్రధాన మంత్రితో మాట్లాడి తక్షణమే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. కడప ఉక్కు సాధన కోసం హైకోర్టు అనుమతితో పాదయాత్ర చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల పాదయాత్రను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ఉక్కు పరిశ్రమపై చిత్తశుద్ధి కలిగించేలా చేస్తామని తెలిపారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ..ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కనీసం కడప స్టీల్ ప్లాంట్ హామీనైనా నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేసు, సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి, టిడిపి, బిఎస్‌పి, జనసేన, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని పాదయాత్రకు మద్దతు తెలిపారు.

ఆర్‌ఆర్‌బి భేటీలకు అధికారులు దూరం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయి. ఆర్‌ఆర్‌బి సమావేశాలకు కేంద్రం తరపున ఎవరూ హాజరు కావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రం తరపున కూడా ప్రతినిధుల హాజరు అంతంతమాత్రంగానే ఉంటోంది. ఇదే అంశాన్ని రిజర్వ్‌బ్యాంకు, నబార్డ్‌లు పలు దఫాలు ప్రస్తావించాయి. తాజాగా జరిగిన ఒక భేటీలో అయితే దీనిని ఒక అజెండాగా కూడా పొందుపరిచారు. గ్రామీణ బ్యాంకుల సమావేశాలకు యాజమాన్య ప్రతినిధులతోపాటు రిజర్వ్‌బ్యాంకు, నబార్డ్, రాష్ట్ర ఆర్థికశాఖ, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు కూడా హాజరు కావాల్సి ఉంటుంది. ఈ సమావేశాల్లో బ్యాంకుల్లో పేరుకుపోయిన అనేక సమస్యలను, ఆర్థికపరమైన నేరాలను కూడా ఎప్పటికప్పుడు చర్చించి తగిన చర్యలు తీసుకోవాల్సిఉంటుంది. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు హాజరుకాకపోవడంతో అటువంటి చర్యలు నామామాత్రంగానే ఉంటున్నాయి. ఇటీవల జరిగిన ఒక సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడంతో నాబార్డు కూడా తీవ్రంగా స్పందించింది. గామీణ బ్యాంకు బోర్డుల్లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా డైరెక్టర్లు నియామకాలు జరగడంలేదని, ఈ డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని నాబార్డ్ పేర్కొంది. దీనిపై ఆయా బ్యాంకులు తమతో సంప్రదించాలని సూచించింది. అలాగే బ్యాంకుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు హాజరు కాకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని బ్యాంకులకు సూచించింది. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి కూడా సమస్యను ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొంది.

ఇద్దరు రైతుల ఆత్మహత్య

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం,కళ్యాణదుర్గం

అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పోచంరెడ్డి సుధాకర్ రెడ్డి (37)కి తొమ్మిది ఎకరాల సొంతపొలముంది. ఇందులో మిరప, పత్తి, వరి, వంగ పంటలు సాగు చేసేవారు. సాగు నిమిత్తం సుమారు రూ.30 లక్షలు అప్పు చేశారు. పంటలు దక్కకపోవడంతో వడ్డీల భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి తాళలేక ఎనిమిది ఎకరాల పొలాన్ని అమ్మి కొంత మేర అప్పులు చెల్లించారు. మిగతా అప్పులు చెల్లించడం కోసం ఉన్న ఎకరా పొలాన్ని రూ. నాలుగు లక్షలకు తాకట్టు పెట్టారు. కుటుంబ పోషణ భారం కావడం, నమ్ముకున్న వ్యవసాయంలో నష్టాలు రావడంతో తీవ్ర మనస్తాపానికి గురై పొలం వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, తల్లి ఉన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన రైతు బొగ్గుల రామన్న(60)కు ఐదు ఎకరాల వ్యవసాయ పొలముంది. ఇందులో టమోటా, మొక్కజొన్న, వేరుశనగ సాగు చేసేవారు. పంటల సాగు, కుటుంబ పోషణకు సుమారు రూ.10లక్షలు అప్పులు చేశారు. గత నాలుగేళ్లుగా పంటలు దక్కకపోవడంతో అప్పులకు వడ్డీల భారం అధికమైంది. అప్పులు తీరే దారి లేక ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య శివమ్మ, ఇద్దరు పిల్లలున్నారు.

టాప్ 500లో 20 భారత కంపెనీలు

- హురున్ రీసెర్చ్ ఇన్స్‌ట్యూట్ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అత్యంత విలువైన అగ్రశ్రేణీ 500 కంపెనీల్లో భారత్‌కు చెందిన 20 కంపెనీలు చోటు దక్కించుకున్నాయని హురున్ రీసెర్చ్ ఇన్స్‌ట్యూట్ వెల్లడించింది. గతేడాది ఈ జాబితాలో 8 కంపెనీలు మాత్రమే ఉన్నాయి. "2022 హురున్ గ్లోబల్ 500" నివేదికన హురున్ రీసెర్చ్ ఇన్స్‌ట్యూట్ శుక్రవారం వెల్లడించింది. భారత్‌లో ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ 202 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో ఉండగా.. ప్రపంచ వ్యాప్తంగా 34వ స్థానంలో నిలిచింది. గతేడాదితో పోల్చితే టాప్ 500 కంపెనీల విలువ 11.1 ట్రిలియన్ డాలర్లు తగ్గింది. వీటిల్లో అత్యధికంగా 104 సంస్థలు ఆర్థిక సేవల రంగానికి చెందినవి కావడం విశేషం. గ్లోబల్ కంపెనీల్లో ఆపిల్ 2.4 ట్రిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో ఉంది. భారత్‌లో 139 బిలియన్ డాలర్లతో రెండో అతిపెద్ద కంపెనీగా టిసిఎస్ నిలిచింది. అదానీ గ్రూపులోని అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ కంపెనీలు టాప్ 500లో ఉన్నాయి.

గుంటూరు జడ్‌పి చైర్‌పర్సన్ కుల ధ్రువీకరణపై విచారణ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కుల ధ్రువీకరణపై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొల్లిపర నుండి జడ్‌పిటిసి అభ్యర్థిగా పోటీ చేసిన హెనీ క్రిస్టినా ఎస్‌సి కాదని, అదే స్థానంలో పోటీ చేసిన బిజెపి అభ్యర్థి సరళకుమారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు చైర్‌పర్సన్ కులం తేల్చాలని కలెక్టర్‌ను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు జడ్‌పి చైర్‌పర్సన్‌కు, పిటిషనర్ సరళకుమారికి నోటీసులు జారీ చేసి వారి నుండి వివరణ తీసుకున్నారు.

సంపాదకీయం

ఎన్నికలు..పాఠాలు..

గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ శాసనసభ ఎన్నికలతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఒక లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు ..వీటికి కాస్త ముందుగా జరిగిన ఢిల్లీ మహానగర పాలక సంస్థ (ఎంసిడి) ఎన్నికలు మొత్తంగా సార్వత్రిక ఎన్నికల వాతావరణాన్ని తలపించాయి. ఢిల్లీలో ఆమాద్మీని, గుజరాత్‌లో బిజెపిని, హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను గెలిపించిన ఓటరు మహాశయులు ఉప సమరంలో రెండు చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్లా బిజెపిని తిరస్కరించారు. పదిహేనేళ్ల అవినీతి మరకలతో అభాసుపాలైన బిజెపిని రాజధాని ఓటర్లు ఊడ్చిపడేశారు. గుజరాత్ కంటే ముందే ఎన్నికలు జరిగిన హిమాచల్ ప్రదేశ్‌లోనూ ఓటర్లు బిజెపిని ఘోరంగా ఓడించారు. అధికార మార్పిడి సాంప్రదాయాన్ని కొనసాగించిన హిమాచల్‌ప్రదేశ్ ఓటర్లు కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యతను అందించారు. హిమాచల్ అసెంబ్లీ 68 స్థానాలుండగా కాంగ్రెస్ 40 సీట్లలో జయభేరి మోగించింది. బిజెపి 25 స్థానాలతో సరిపెట్టుకుంది.


గుజరాత్‌లో ఊహించినదానికంటే అధికంగా బిజెపి అఖండ విజయం సాధించింది. అక్రమాల కారణంగా మోర్బీ వంతెన కుప్పకూలిపోయి 135 మంది ప్రాణాలు బలిగొన్నా..గుజరాత్ నమూనా అంతా డొల్ల అని తేలిపోయినా.. అక్కడ కూడా బిజెపినే నెగ్గింది. నింగినంటిన ధరల నియంత్రణకు చేసిందేమిటి? నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గమేదీ? రైతుల ఘోష విన్నదెప్పుడు? పోషకాహార సంగతేమిటీ? మహిళలకు భద్రతేదీ? ఇలాంటి ప్రజా సమస్యలేవీ చర్చకు రానివ్వకుండా బడా కార్పొరేట్ సంస్థల కాసులతో, కార్పొరేట్ మీడియా అండతో ప్రధాని మోడీ గుజరాత్‌లో మాయాజాలం సృష్టించిన మాట వాస్తవం. మైనార్టీలను వేధింపులకు గురిచేసేందుకు ఉద్దేశించిన ఉమ్మడి పౌర స్మృతి, నిరసనకారుల నుంచి నష్టపరిహారం రాబట్టే బిల్లు, మత మార్పిడి వ్యతిరేక బిల్లు తెస్తామనే హామీలను మేనిఫెస్టోలో చేర్చిన బిజెపి పూర్తి మతతత్వ ఎజెండాతోనే గుజరాత్ ఎన్నికల్లో నిలిచి నెగ్గింది. గోద్రా అనంతరం అత్యాచారాలు, హత్యలకు తెగబడి శిక్ష అనుభవిస్తున్న సంఘ్ పరివార్ దుండగులకు క్షమాభిక్ష పెట్టింది కూడా ఈ ఎన్నికల నేపథ్యంలోనే.

182 స్థానాలున్న గుజరాత్ అసెంబ్లీలో 152 చోట్ల గెలుపొందడమే కాకుండా 52.3 శాతం ఓటింగ్ సాధించడం అషామాషీ కాదు. సాంప్రదాయంగా కాంగ్రెస్, బిజెపి మధ్యనే ద్విముఖ పోటీ ఉండే గుజరాత్‌లో ఈ దఫా ఆమాద్మీ పార్టీ రంగ ప్రవేశం చేసి ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం కూడా బిజెపికి బాగా కలిసొచ్చింది. దీంతో కాంగ్రెస్ 17 స్థానాలకు పరిమితమైంది. ఆమాద్మీ పార్టీ 12.9 శాతం ఓటింగ్‌తో 5 స్థానాలు చేజిక్కించుకోవడంతో పాటు జాతీయ పార్టీ హోదాకు చేరుకోవడం గమనార్హం. దేశం వృద్ధి సాధించాలంటే నోట్లపై లక్ష్మీదేవి, గణేష్ చిత్రాలను ముద్రిస్తే చాలు అంటూ ఆమాద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేసిందీ ఈ ఎన్నికల నేపథ్యంలోనే. సంఘ్ పరివార్ సృష్టించిన బలమైన మతపరమైన ఓటు బ్యాంక్‌కు, మోడీ 'గుజరాత్ ఆత్మగౌరవ' నినాదం, ఆప్ చీలిక తోడవ్వడంతో బిజెపిని విజయతీరాలకు చేర్చాయన్నది విశ్లేషకుల మాట. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర గుజరాత్ మీదుగా సాగకపోవడమే కాంగ్రెస్ నాన్చుడు ధోరణికి నిదర్శనం. మోడీ, అమిత్ షా గుజరాత్‌లోనే తిష్టవేసినంతగా ప్రచారం సాగిస్తుంటే రాహుల్ మాత్రం ఒక్క రోజే అక్కడ ప్రచారం చేపట్టడం విడ్డూరం.

ఉత్తరప్రదేశ్‌తో సహా ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఒక లోక్‌సభ స్థానం, ఆరు అసెంబ్లీ స్థానాల ఉప సమరంలో బిజెపి తీవ్ర పరాభవం పాలైంది. రెండు చోట్ల మినహా మిగిలిన అన్ని స్థానాల్లోనూ బిజెపి ఓటమి పాలైంది. మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ మరణంతో ఉప ఎన్నికలు జరిగిన యు.పి లోని మెయిన్‌పురిలో సమాజ్‌వాదీ పార్టీ ఘనవిజయం సాధించింది. రెండు అసెంబ్లీ స్థానాల్లో ఒక చోట బిజెపి, మరోచోట ఆర్‌ఎల్‌డి గెలుపొందాయి. రాంపూర్ శాసనసభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ ఓటర్లను పోలింగ్‌కు రానివ్వకుండా బిజెపి, దాని అదుపాజ్ఞల్లోని పోలీసు, అధికార యంత్రాంగం కుట్ర పన్నాయి. కేవలం 33 శాతం లోపే పోలింగ్ జరగడం అందుకు పెద్ద నిదర్శనం. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్, ఒడిశాలో బిజెడి, బీహార్‌లో బిజెపి విజయం సాధించాయి.

మోడీ, అమిత్ షాతో సహా పలువురు మంత్రులు సుడిగాలి పర్యటనల్తో చక్కర్లు కొట్టినా ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్‌లలో బిజెపి ఘోర పరాజయం పాలైంది. కనుక మోడీ-షా ద్వయాన్ని ఓడించవచ్చునని మరోసారి రుజువైంది. ఈ ఫలితాల నుండి ప్రతిపక్ష పార్టీలు సరైన గుణపాఠాలు తీయాలి. బిజెపి వ్యతిరేక ఓటును ఏకీకరణ చేసేలా రాష్ట్రాల వారీగా వ్యూహాలు రూపొందించాలి. తద్వారా బిజెపిని ఒంటిరిపాటు చేయడం, ఓడించడం సాధ్యమవుతాయి.

మంచి మాట



విజయానికి కావలసింది
పది శాతం ప్రేరణ,
తొంబై శాతం కఠోర శ్రమ.

- థామస్ ఆల్వా ఎడిసన్,
ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త.

Thomas A. Edison

భారత జర్నలిజంలో చీకటి యుగం

విమర్శ

రవీష్ కుమార్ అత్యంత గౌరవనీయమైన భారత జర్నలిస్టు. ఆయన 1996లో ఎన్.డి టి.వి లో చేరి, రవీష్ కీ రిపోర్ట్, దేశ్ కీ బాత్, ప్రైమ్ టైమ్ విత్ రవీష్...వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఆసియాలో కెల్లా సంపన్నుడూ, భారత ప్రధాని నరేంద్ర మోడీకి సన్నిహితుడూ అయిన గౌతమ్ అదానీ ఎన్.డి టి.వి ని కొనివేయబోతున్నాడనే వార్త వెలువడిన కొద్ది గంటల్లోనే రవీష్ కుమార్ తాను ఎన్.డి టి.వి కి రాజీనామా చేస్తున్నానని తన యూట్యూబ్ చానెల్ మీద ప్రకటించారు. ఆ రాజీనామా సందర్భంగా 2022 డిసెంబర్ 1న ఆయన ఇచ్చిన ఉపన్యాస పాఠం.



రవీష్ కుమార్

భారత జర్నలిజంలో స్వర్ణయుగం అనబడేదేదీ లేదు. కాని పరిస్థితి ఇవాళ ఉన్నంత ఘోరంగా మరెప్పుడూ లేదు. జర్నలిజం లోని ప్రతి ఒక్క మంచి అంశాన్నీ వేగంగా ధ్వంసం చేస్తున్నారు. ఇది ఊహించినదే. కాని, ఇవాళ వాస్తవంగా నడుస్తున్నది జర్నలిజంలో 'చీకటి యుగం'. దేశంలో లెక్కలేనన్ని వార్తా చానళ్లు ఉన్నాయి కాని అన్నిటికన్నీ నీతి తప్పి ఉన్నాయి. మన ప్రచార మాధ్యమాల పర్యావరణమే కుప్పకూలిపోయి, ధ్వంసమైపోయి ఉన్నది.

ఇవాళ ప్రతి ఒక్కరూ తనను తాను జర్నలిస్టుననే చెప్పుకుంటున్నారు. మరీ ముఖ్యంగా అధికారబలం ఉన్నవారికి సన్నిహితంగా ఉన్నవారు లేదా వారితో ఉన్నవారు. ఈ దేశంలో జర్నలిజం అణగిపోవడానికి అసలైన కారణం ఈ జర్నలిస్టుల ముఖాలూ, వారి సంస్థలూ కావడం ఒక వైచిత్రి. వాళ్లు తామే మంచి జర్నలిజాన్ని తెస్తున్నామని కూడ చెప్పుకుంటున్నారు. వారి పట్ల జాగ్రత్తగా ఉండమని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రశ్నలే లేని ఈ జర్నలిస్టులూ, చివరికి ప్రభుత్వమూ కూడ జర్నలిజం గురించి వారి నిర్వచనాన్నే మీ గొంతులోకి తోయడానికి ప్రయత్నిస్తున్నారు.

ఎన్.డి టి.వి తో నా జ్ఞాపకాలు...

ఎన్.డి టి.వి తో నాకు ఆసక్తికరమైన జ్ఞాపకాలెన్నో ఉన్నాయి. ఎవరో ఒక వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పడం చాల కష్టం. మీ వృత్తిపరమైన ప్రయాణానికి ఎందరెందరో దోహదం చేసినప్పుడు, ఎవరో ఒకరికే కృతజ్ఞతలు ఎలా చెప్పగలరు? గతంలో పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న సహోద్యోగులు ఎంతో మంది తమలోని ఒక భాగాన్ని నాలో చూస్తారని నాకు తెలుసు. అది సరైనదే కూడ. అలాగే నేను ప్రతి ఒక్కరినుంచీ ఎంతో కొంత తీసుకున్నాను. అందుకు కృతజ్ఞుణ్ని.

ఒక టి.వి ని నిర్మించేది బృందాలే అని ఎన్.డి టి.వి నాకు నేర్పింది. యాంకర్లకు ప్రాధాన్యత పెరిగిపోయి వాళ్లు స్టార్లుగా మారాక, ఈ భావన కొంత దెబ్బతిన్నది. అయినా, మీ బృందం ఎంత మంచిదైతే మీ పని అంత మంచిదవుతుందని ఇవాళ కూడ నేను నమ్ముతున్నాను.

ఎన్.డి టి.వి లో అనువాదకుడిగా లాంఛనంగా 1996 ఆగస్ట్‌లో చేరాను. కాని అంతకు ముందు కూడ, ఎన్.డి టి.వి లో వీక్షకులు రాసిన చేతి రాత ఉత్తరాలు చదివే పని చేసేవాణ్ని. ఆ ఉత్తరాలు వేరు వేరు కార్యక్రమాల మీద ఆయా యాంకర్లను ఉద్దేశించి ఉండేవి. ఆ ఉత్తరాలు చదువుతున్నప్పుడే దేశంలో టి.వి వీక్షకులు ఎలా తయారవుతున్నారో నాకు తెలిసింది. ఆ ఉత్తరాలు చదివి, వాటి ఆధారంగా నివేదికలు తయారుచేసి ఆయా కార్యక్రమాల నిర్మాతలకు ఇవ్వడం నా పని. అప్పుడు నేను ఒక రోజు కూలీని. నాకు అట్లాగే లెక్కకట్టి డబ్బులు ఇచ్చేవారు.

వాళ్లతో పోలిస్తే మన కష్టాలు పిపీలికాలు

ఎవరో లాగేసినందువల్ల గూడు కోల్పోయిన పక్షి లాగుంది నా పరిస్థితి. కాని పక్షికి ఇప్పుడింకా ఎగరడానికి విశాల ఆకాశం ఉంది.

నేను విలేకరులు రాసిన నివేదికలనూ కథనాలనూ ఇంగ్లిష్ నుంచి హిందీలోకి అనువాదం చేస్తుండేవాణ్ని. ఆ తర్వాత నేనే విలేకరినయ్యాను. రవీష్ కీ రిపోర్ట్ అనే అనుదిన కార్యక్రమ నిర్మాతనయ్యాను.

ఉత్తరాలు చదివే పనిలో చేరిన మనిషి గ్రూప్ ఎడిటర్ అయ్యాడు. అది కేవలం ఎన్.డి టి.వి లోనే సాధ్యం. ఇవాళ ఆ మనిషి తన రాజీనామా సమర్పిస్తున్నాడు.

ఈ సంస్థ వెనుక దారాలు లాగే శక్తిమంతమైన మనుషులెందరో ఉన్నారు. అందువల్ల ఇటువంటి రోజొకటి వస్తుందనేది నిశ్చయమే. కాని ఇప్పుడు ఆ రోజు వచ్చేసరికి, అది విచారకరంగా అని పిస్తున్నది.

నన్ను అంచనా కట్టేటప్పుడు, చాల కింది స్థాయిలో ప్రారంభిం చానని నా మీద జాలిపడరనే ఆశిస్తా ను. చాల కింది స్థాయిలో ప్రారంభిం చామని చెప్పి సానుభూతి సంపా దించేవాణ్ని కాను నేను. అటువంటి వాళ్లు తాను ఎట్లా ఒక చిన్న చాయ్ దుకాణంలో బాల్యం గడిపానో అని హఠాత్తుగా చెపు తుంటారు. అదే సమయంలో అత్యంత ఖరీదైన విమానాల్లో ప్రయాణిస్తుంటారు. నా జీవన ప్రయాణం ఏదో అసాధారణమైనదని నేను అనుకోను. ఈ దేశంలో ప్రతి ఒక్కరిదీ కష్టభరితమైన జీవితమే. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో ఉన్న రోగుల కుటుంబాలతో మాట్లాడి చూడండి. వాళ్లు ఎన్నెన్ని కొండగుట్టలు ఎక్కి అక్కడికి చేరారో ఊహించడం కూడ సాధ్యం కాదు. వాళ్లతో పోలిస్తే మన కష్టాలు పిపీలికాలు.



నేను మీ కోసం పనిచెయ్యడానికి ప్రయత్నించాను

ఇవాళ నేను మీతో టి.వి వీక్షకుల గురించి మాట్లాడదలచాను. వ్యవస్థలూ నిర్మాణాలూ పడిపోవడమూ, సమాజాలను విద్వేష కెరటాలు ముంచెత్తడమూ ఇటీవల మనందరమూ చూస్తున్నాం.కాని ఒక కొత్త వ్యవస్థ రూపు దిద్దుకోవడం నేను కళ్లారా చూశాను.ఆ వ్యవస్థ పేరు పౌరసత్వం. ఎన్.డి టి.వి నాకొక అవకాశం ఇచ్చినప్పుడల్లా నేను మీ కోసమే పని చెయ్యడానికి ప్రయత్నించాను. నాకు అందిన అవకాశాన్ని మీ కథలతోనే నింపాను.

మీరు నామీద పెద్ద బాధ్యత పెట్టారు. మీరు మీ ఇళ్లలో, మీ మనసుల్లో నాకోసం ఒక న్యూస్ రూం నిర్మించారు.ప్రపంచవ్యాప్తంగా వీక్షకులు నాకు సహాయపడడానికి ముందుకొచ్చారు.మీరు నన్ను డబ్బు అడగలేదు. మీ కోసం ఏదో సహాయం చేయమని అడగలేదు.చాలమంది నా వీడియోలు రికార్డ్ చేసి పెట్టారు, నా పరిశోధనలో సహ కరించారు. నా కార్యక్రమాలలో ప్రతి ఒక్కటీ మీ సహకారానికి ఒక వ్యక్తీకరణ. మీరే నాకు సమాచారం అందిం చారు, నా పొరపాట్లకు మందలించారు, నా కార్యక్రమాల్లో భాగమయ్యారు.

నిపుణులు, విద్యార్థులు, ప్రవాసులు, భారతీయులు అందరూ వీక్షకులే. కాని నా సహప్రయాణికులయ్యారు, తమంతట తామే జర్నలిస్టులయ్యారు. ఆవిధంగా వాళ్లు జర్నలిజం అనే ఒక చిన్న ద్వీపాన్ని పరిరక్షించారు.

ఆ అర్థంలో నేను టి.వి వీక్షకుల సముదాయం తయారు కావడమూ చూశాను, అది పూర్తిగా విచ్ఛిన్నమైపోవడమూ చూశాను. ఇప్పుడు, ఆ సముదాయం ఒక వ్యవస్థగా లేచి నిలవడం చూస్తున్నాను.

మీరు నా కృషిని విభిన్నమైన భాషలలోకి అనువదించారు. నాకు కావలసిన వనరులు ఎప్పుడూ అందుబాటులో ఉండేవి కావు, కాని మీరే వాటిని నాకు అందుబాటులోకి తెచ్చాను. నిజానికి నేను నడిపిన కార్యక్రమం ప్రైమ్ టైమ్ మీ ప్రైమ్ టైమే. ఆ కార్యక్రమంలో ఎప్పుడన్నా కొరత కనబడితే, వెనువెంటనే మీ అసంతృప్తి ప్రదర్శించేవారు. వీక్షకులే నాకు ఎల్లవేళలా సంపాదకులు. ఒక మనిషంటే అతని చుట్టూ ఉన్న మనుషుల సమాహారమే అని నేను ఎప్పుడూ అంటుంటాను. వీక్షకులుగా మీరు ఉన్నందువల్లనే రవీష్ కుమార్ ఇవాళ ఇక్కడ నిలబడి ఉన్నాడు.

మీ మద్దతు వల్లనే ఎంతోమంది జర్నలిస్టులు యూట్యూబ్ మీద, ట్విట్టర్ మీద ఉండగలుగుతున్నారు. మీరు వెబ్ సైట్లకు చందాదారులయ్యారంటే, అవి నిలబడి ఉండడానికి సహాయ పడుతున్నారన్నమాట.

జర్నలిస్టులకు వీక్షకులెట్లా సహకరిస్తారు...

ప్రజాస్వామిక వ్యవస్థలు బలహీనపడినప్పుడు, న్యాయస్థానాలు కూడ బలహీనపడినట్టు కనబడినప్పుడు, బలోపేతంగా నిలబడినది మీరే. ఇవాళ్టి పరిస్థితులలో జర్నలిజపు అతి పెద్ద వ్యవస్థ మీరే. ఇవాళ జర్నలిజం వివేకవంతులైన వీక్షకులలోనే జీవిస్తున్నది, బ్రహ్మాండమైన భవనాల్లో, సంస్థల్లో కాదు.ఈ కాలంలో మీరు చేస్తున్న అతి పెద్ద సహాయం ఏమంటే, మీరు కఠినమైన ప్రశ్నలు అడిగే జర్నలిస్టుల పక్కన నిలబడుతున్నారు.

ప్రజల గొంతును నొక్కేసే శక్తులుండవచ్చు. ప్రజల గొంతును మత విద్వేషంతో నింపే, ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే శక్తులుండవచ్చు. కాని మీలో కొందరు నాలో ఆశలు రేకెత్తిస్తున్నారు. ఎందుకంటే, ప్రజాస్వామ్యమనేది చచ్చిపోయినప్పటికీ, సవ్యంగా సాగే ప్రజాస్వామ్యం ఉండాలనే కోరిక మిగిలే ఉంటుంది. అదంతా మీ వంటి బాధ్యతాయుత వీక్షకుల వల్లనే.

నాకు పని చేసుకోవడానికి అవధులు లేని స్వేచ్ఛ లభించింది. నా జీవితమే దాని మీద ఆధారపడినట్టుగా నేనా స్వేచ్ఛను కాపాడుకున్నాను. ఆ సమయంలో మీరు, విజ్ఞులైన వీక్షకులు నన్ను పరీక్షిస్తున్నారని నాకు తెలుసు. ఏ పొరపాటూ చేయకుండా ఉండడానికీ, అహంకారాన్ని దరిచేరనీయకుండా ఉండడానికీ జాగ్రత్తలు తీసుకున్నాను. అహంకారం వచ్చిందంటే నా స్వేచ్ఛను కోల్పోతానని నాకు తెలుసు.నా కళ్ల ముందే ప్రపంచం మారిపోతూ ఉండగా, టెస్ట్ మాచ్‌లో బాట్స్‌మన్ లాగ నేను రేఖ మీదనే నిలబడ్డాను. కాని హఠాత్తుగా ఎవరో అసలు మాచ్ నే ముగించారు, ఆట నియమాలను మార్చేశారు.వీక్షకుల మీద ఇష్టారాజ్యంగా స్వారీ చేసేవాళ్లు ప్రతి దేశంలోనూ ఉంటారు. భారతదేశంలో కూడ ఉన్నారు. వాళ్లు మీకు వాస్తవాలే ఇస్తున్నామని నమ్మబలికితే అర్థమేమంటే, డాలర్లకు డాలర్లు తమ జేబుల్లో వేసుకుంటూ మీకు చిల్లర సెంట్లు విసురుతున్నా రన్నమాట.వాళ్ల తప్పులను బహిర్గతం చేయడానికి జర్నలిస్టుల్లో, వార్తాసంస్థల్లో ప్రయత్నిస్తే, వారి మీద లెక్కలేనన్ని కేసులు బనాయిస్తారు. మళ్లీ వాళ్లే అర్థవంతమైన జర్నలిజమంటే తమకు అమిత ఆసక్తి అని గంభీరంగా చెపుతుంటారు.

హిందీ జర్నలిజం అవసరం

భారతదేశంలో అత్యధిక గౌరవం పొందే జర్నలిస్టులు ఇంగ్లిష్ మాధ్యమాలలో పనిచేసేవారే. అందువల్లనే నేను హిందీ జర్నలిజానికి గౌరవనీయత తేవడానికి ప్రయత్నించాను. ఈ భాషలో జర్నలిజం కూడ ముఖ్యమైనదేనని చూపాను. దేశం మొత్తం నుంచీ ప్రజలు నా హిందీని ప్రేమించేలా చేసేందుకు ప్రయత్నించాను. నిజానికి నా మాతృభాష హిందీ కాదు, భోజ్‌పురి. నేను నా భోజ్‌పురి కుగ్రామం నుంచి ఈ హిందీ మహానగరానికి నడిచివచ్చాను. నా హిందీని సంపద్వంతం చేసిన దేశంలోని హిందీయేతర ప్రాంతాల ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పదలచాను.

జర్నలిస్టులు ఏం చేయవలసి ఉంది?

మీ గళాన్ని అత్యున్నత స్థాయిల దాకా తీసుకుపోయే మాధ్యమంగా ఉండడమే జర్నలిస్టులు చేయవలసిన పని. ఈ దేశాన్ని మీ కళ్ల ద్వారా చూడడానికే నేను ఎల్లప్పుడూ ప్రయత్నించాను. మీ క్రియాశీలతే భారత ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచుతుంది. షహీన్ బాగ్, రైతుల ఆందోళన మీలో నా విశ్వాసాన్ని ఇనుమడింపజేశాయి. మీరు బాధ్యతాయుత పౌరులుగా రూపాంతరం చెందుతుండడం నేను గమనించాను. మీరే భవిష్యత్తులో మెరుగైన సమాజాలను సృష్టించగలరు.

సమాజం లోని సమస్త రంగాలనూ తమ అదుపులో ఉంచుకోగలమని ఇవాళ కొందరు భావిస్తున్నారు. పౌరులను గడ్డిపోచల్లా తీసేయగలమని లెక్కలేకుండా ప్రవర్తిస్తున్నారు. ప్రచార మాధ్యమాలనేవి మరణించాయి. రాజకీయ ప్రతిపక్షం పెనుగులాడుతున్నది. అదంతా నిజమే. కాని ఇటువంటి స్థితి శాశ్వతం కాదు. ఒకానొక రోజున ప్రజలు తమ విద్వేషాన్ని అధిగమిస్తారు. వారు ఒక కొత్త సమాజాన్ని నిర్మించడం గురించి ఆలోచిస్తారు. అప్పుడు వారు జర్నలిజం గురించి ఆలోచిస్తారు. నేను చదవడమూ, మాట్లాడడమూ, రాయడమూ ఎన్.డి టి.వి దగ్గరే నేర్చుకున్నాను. మంచి దుస్తులు ధరించడం ఎట్లాగో, టై కట్టుకోవడం ఎట్లాగో ఎన్.డి టి.వి దగ్గరే నేర్చుకున్నాను.

మహిళా జర్నలిస్టుల దగ్గర నేర్చుకున్న పాఠాలు

నా మహిళా సహోద్యోగులను నేను ప్రత్యేకంగా తలచుకోదలచుకున్నాను.వాళ్లే నాకు నిజాయితీగా ఉండడం, కష్టపడి పని చేయడం, నీతిగా ఉండడం నేర్పారు. సామాజిక సమస్యల పట్ల నా అవగాహనలను వాళ్లు విశాలం చేశారు. ఎందరో స్త్రీల, బాలికల అనుభవాలు నా ప్రయాణంలో కలిసిపోయాయి. నా సహచరి, నా కూతుళ్లు, మా అమ్మ నాకు మద్దతు ఇచ్చారు. జర్నలిజంలో పురుషుల రాజ్యమే, పితృస్వామ్యమే నడుస్తున్నది. వారి దూకుడు ఇబ్బందికరంగా ఉండేది. అటువంటి దూకుడు సృజనాత్మకతనూ, ఆలోచననూ చంపేస్తుంది. అటువంటి దూకుడుకు పాల్పడకుండా నన్ను నా మహిళా సహోద్యోగులే కాపాడారు. ఈ జర్నలిజం క్షేత్రంలో ఇప్పుడిప్పుడే అడుగు పెడుతున్నట్టయితే మీకు నా సలహా ఏమంటే ఎల్లప్పుడూ మీ మహిళా సహోద్యోగులతో మన్ననగా ఉండండి. వాళ్ల సామర్థ్యాన్ని అంగీకరించండి, గౌరవించండి. వాళ్లను ప్రశంసించండి.

భారత దేశపు ప్రచార మాధ్యమాల స్థలం మారిపోయింది. జర్నలిస్టులుగా మారాలనే కోరికతో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చదువుకుంటున్న భారతీయ యువకులను తలచుకుంటే నా హృదయం ద్రవిస్తున్నది. ఎందుకంటే, వాళ్లు చివరికి భారత రాజ్యపు సేవకులుగా పని చేయవలసి వస్తుంది. నీతిమంతులైన జర్నలిస్టులు పని చేయడానికి ఏ ఒక్క సంస్థా మిగలలేదు.

ఇవాళ జర్నలిస్టులుగా ఉన్నవారందరూ కూడ అయితే ఊపిరిసలపని స్థితిలోనైనా ఉన్నారు, లేదా ఈ వృత్తినే వదిలేసి వెళ్లిపోయారు. జర్నలిజం అంటే నెల జీతం అందే ఒకానొక వృత్తే తప్ప మరేమీ కాదని నాకు ఎందరో చెప్పారు. జీతం మినహా జర్నలిజంలో ప్రోత్సాహకమైన ప్రేరణ ఏదీ లేదు.

పవిత్రమైన జర్నలిస్టు పౌరప్రజానీకానికి బాధ్యత వహించాలి. కనుక నిర్భయంగా మాట్లాడండి. ఉట్టి పాదాలతో నడిచి మహా బలోపేతమైన బ్రిటిష్ పాలనను మట్టి కరిపించిన దేశపు పౌరులు మీరు. మిమ్మల్ని నమ్మకుండా ఉండడానికి కారణమే లేదు. అనైతికమైన మాధ్యమాల వార్తాసందేశాల సంకెళ్లను మీరు తెంచుకోగలరు. మీరు అందుకు పోరాడవలసి ఉంది. పోరాడకపోతే మీకు తలెత్తి నడిచే అవకాశమే లేదు. మీరు ఆ పోరాటం చేయకపోతే, మీరు ఒక స్వతంత్ర దేశపు పౌరులుగా ఉంటారేమో గాని, అమ్ముడు పోయిన మాధ్యమాల బానిసలుగా మిగిలిపోతారు. అటువంటి స్థితి వస్తుందేమో తస్మాత్ జాగ్రత్త. చట్టవ్యతిరేకమైనదంతా చట్టబద్ధమైనదిగా కనబడేలా చేసేందుకు చట్టాల పేరు మీద ప్రజల హక్కులు కొల్లగొట్టబడుతున్నాయి.

ఈ క్షణాన, నా భవిష్యత్తు అనిశ్చితం. కచ్చితంగా ఉన్నదొకే ఒకటి, ఆశ.

(హిందీ నుంచి ఇంగ్లిష్: రక్షా కుమార్,
ఇంగ్లిష్ నుంచి తెలుగు: ఎన్ వేణుగోపాల్)

చర్చ

'పతంజలి' అశాస్త్రీయ వ్యాపార ప్రకటనలు



డా॥ కె. శివబాబు

ప్రముఖ యోగా గురు రాందేవ్ బాబా నేతృత్వంలో నిర్వహించబడుతున్న "పతంజలి ఆయుర్వేద సంస్థ" మన దేశంలో పలు రకాల వ్యాధులకు ఔషధాలను విక్రయిస్తున్నది. బి.పి, షుగర్, ఆస్తమా, గుండె జబ్బులు, పక్షవాతం, ఊబకాయం, కేన్సర్ వంటి సాంక్రమికేతర, జీవనశైలి సంబంధిత వ్యాధులకే గాక, సాంక్రమిక వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, డెంగ్యూ, కరోనా వంటి వైరల్ వ్యాధులతో సహా పలురకాల వ్యాధులకు సైడ్-ఎఫెక్ట్స్ లేని సహజసిద్ధమైన విధానంతో చికిత్స పేరిట విస్తృతంగా పతంజలి మందులు చలామణీలో ఉన్నాయి. పతంజలి యోగ్ పీఠ్ ట్రస్ట్‌కు చెందిన దివ్య ఫార్మసి ఇలాంటి మందుల విక్రయం ద్వారా 2020-21 సంవత్సరంలో అక్షరాలా రూ. 9783 కోట్లు టర్నోవర్ చేసింది.

మందుల విక్రయంతో పాటుగా పతంజలి ఫుడ్స్ పేరిట నడుస్తున్న ఆహార మరియు కాస్మొటిక్ ఉత్పత్తులు కూడా భారీగా టర్నోవర్ సాధిస్తున్నాయి. ఆవు నెయ్యి (రూ. 1467 కోట్లు), కేశ్ కాంతి షాంపు (రూ. 825 కోట్లు), దంత్ కాంతి టూత్ పేస్ట్ (రూ. 940 కోట్లు), సబ్బు (రూ. 574 కోట్లు) ...ఇంకా తేనె, బిస్కట్లు, జామ్, కెచప్, డ్రై ఫ్రూట్స్, గోధుమపిండి, పప్పుధాన్యాలు, తల నూనె, ఫేస్ వాష్, అలోవేరా జెల్, అగర్బత్తి, ధూపాలు..వంటి ఉత్పత్తులను కల్గిన ఎఫ్.ఎమ్.సి.జి (ఫాస్ట్ మూవింగ్ కన్‌జూమర్ గూడ్స్) బిజినెస్ సెక్టార్‌లో అతిపెద్ద దిగ్గజంగా ఎదిగింది. పతంజలి మందుల పరిశ్రమతో పాటు ఇవన్నీ కలిపితే సుమారు 30 వేల కోట్లకు పైగా టర్నోవర్ చేస్తున్నట్లు ఆ సంస్థ విడుదల చేసిన లెక్కల ద్వారానే తెలుస్తోంది. కోట్ల మంది ప్రాణాలను బలిగొన్న కరోనాను కూడా మూడు రోజుల్లో నియంత్రించ వచ్చుననే ప్రచారంతో "కరోనిల్" మాత్రలను కరోనా సమయంలో పెద్ద ఎత్తున విక్రయించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శాస్త్రీయత ఉన్నా లేకున్నా, అత్యంత చాకచక్యంగా, దూకుడుగా ప్రజాకర్షక క్యాప్షన్లతో కూడిన ప్రకటనల ద్వారా రాందేవ్ బాబా తన వ్యాపారాన్ని విస్తరిస్తు న్నారు. తాజాగా కొద్ది సంవత్సరాల నుండి అల్లోపతి వైద్యం పైన అసంబద్ధమైన వ్యాఖ్యలు చేస్తూ, అశాస్త్రీయ అంశాలతో ప్రకటనలు విడుదల చేస్తూ వివాదాలకు గురవుతున్నారు. కరోనా నేపథ్యంలో కూడా "కరోనిల్" మాత్రల అమ్మకం కోసం కరోనాకు అల్లోపతి వైద్యం వేస్ట్ అనీ, స్టుపిడ్ సైన్స్ అనీ అవాకులు చెవాకులు పేలారు. అనేకసార్లు ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ (ఐ.ఎం.ఏ) జాతీయ సభ్యులు, పలువురు వైద్య నిపుణులు కూడా రాందేవ్ బాబా వ్యాఖ్యలనూ, ప్రకటనలనూ ఖండించారు. అయినప్పటికీ రాందేవ్ బాబా తన వ్యాపార ఎత్తుగడల్లో భాగంగా అల్లోపతి వైద్యంపై కువిమర్శలతో దాడి చేస్తూనే ఉన్నారు.



కొద్ది నెలల ముందు "పతంజలి వెల్‌నెస్" పేరిట ప్రముఖ జాతీయ స్థాయి ఇంగ్లీషు పత్రికలలో సగంపేజీ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో పతంజలి మందులతో అనేక వ్యాధుల్ని నయం చేస్తామనీ, మొత్తానికే మందులు అవసరం లేకుండా వ్యాధిరహితంగా చేస్తామనీ పేర్కొంటూనే ఆయా వ్యాధులకు అల్లోపతి మందుల ద్వారా చికిత్స జరగకపోగా, అనేక నష్టాలు వాటిల్లుతున్నట్లు ప్రతి వ్యాధికి సంబంధించిన సమాచారంలో పేర్కొనడం జరిగింది.

ప్రజలలో అతి సాధారణంగా కనబడే బి.పి, షుగర్, థైరాయిడ్, కన్ను, చెవి సంబధిత వ్యాధులు, చర్మ వ్యాధులు, కీళ్ల వ్యాధులు, ఆస్తమా, సంతాన సాఫల్యత, మానసిక వ్యాధులు తదితర వ్యాధులన్నిటినీ పతంజలి వైద్యం ద్వారా నయం అవుతాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పైగా ఆ ప్రకటనకు "అల్లోపతి ప్రచారం చేస్తున్న అపోహలు" అని హెడ్డింగ్ పెట్టారు.

ప్రజలను గందరగోళపరచే ఇటువంటి ప్రకటనల నేపథ్యంలో అల్లోపతి లేదా ఇతర వైద్య విధానాల ఉపయోగాలు, పరిమితుల గురించి కొన్ని అంశాలు పరిశీలించాల్సి వుంది. ఏ వైద్య విధానం కూడా పరిపూర్ణంగానూ, లోపభూయిష్టంగానూ ఉండదు. అల్లోపతి వైద్యవిధానంలో కూడా కొన్ని మందులకు సైడ్-ఎఫెక్ట్స్ ఉంటాయి. సాధారణంగా అల్లోపతి వైద్య విధానంలో ఏవైనా వ్యాధులకు చికిత్సగా పేర్కొనబడే ఔషధాలను ప్రజలు వాడేందుకు అనుమతించాలంటే కనీసం మూడు దశల్లో క్లినికల్ ట్రయల్స్ (పోస్ట్ మార్కెటింగ్ దశతో కలిపి నాలుగు దశలు) జరిపి ఆ అధ్యయనాల ఫలితాల్ని ఔషధ నియంత్రణ అధారిటీకి సమర్పించాల్సి వుంటుంది. అవి పరిశీలన జరిగి, అధికారికంగా అనుమతి పొందిన తర్వాత మాత్రమే ఆ మందులు పబ్లిక్ మార్కెట్లోకి విడుదల చేయాల్సి వుంటుంది. ఉదాహరణకు కోట్లాదిమంది ప్రాణాలను కాపాడిన యాంటిబయాటిక్స్, ఇన్సులిన్, యాంటి-మలేరియల్స్, క్షయవ్యాధి మందులు, వ్యాధినిరోధక వ్యాక్సిన్లు, శస్త్రచికిత్సలు వంటివి అల్లోపతి ఆవిష్కరణలే అన్నవిషయం ఎవరూ కాదనలేనిది. అంతెందుకు. సాక్షాత్తూ పతంజలి సంస్థలో మరో కీలక భాగస్వామి, రాందేవ్ బాబా అనుంగు మిత్రుడైన ఆచార్య బాలకృష్ణ 2019లో ఫుడ్ పాయిజనింగ్ బారిన పడితే ఎయిమ్స్ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో చేరి చికిత్స పొందిన విషయం అందరికీ తెలిసిందే. కానీ కొన్ని దీర్ఘకాల వ్యాధుల చికిత్సలో అల్లోపతి వైద్యానికి ఉన్న పరిమితులు లేదా కొన్ని అల్లోపతి మందులకు ఉండే సైడ్-ఎఫెక్ట్స్ పట్ల ప్రజలలో ఉన్న భయాలనూ, సందేహాలనూ ఆసరాగా చేసుకుని అసంబద్ధమైన వ్యాఖ్యలతో ప్రకటనలు చేసి తమ ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసుకోవడం గర్హనీయం. బి.పి, షుగర్, సంతాన సాఫల్యత వంటి వ్యాధులకు మందు గోళీల నుండి మొదలుకుని ఆవు నెయ్యి, తేనె, గోధుమ పిండి, సబ్బు బిళ్ల, టూత్ పేస్ట్, ఫేస్‌వాష్ వంటి గృహావసర, సౌందర్యోత్పత్తుల దాకా వేలాది కోట్ల రూపాయల టర్నోవర్ చేసుకుంటున్న పతంజలి వ్యాపార సామ్రాజ్య మనుగడ వెనుక ప్రభుత్వాల, అధికారుల రాజకీయ, ఆర్థిక స్వార్థ ప్రయోజనాలు వున్నాయనేది దాగని సత్యం. ప్రజల ప్రాణాలతో చెలగాటమా డుతున్న ఇలాంటి అశాస్త్రీయ ఆరోగ్య వ్యాపార ప్రకటనల్ని ప్రజలు, మేధావులు, వైద్య నిపుణులు, ప్రజారోగ్య శ్రేయోభిలా షులు పెద్ద ఎత్తున నిరసించాలి. ప్రభుత్వాలు స్పందించి 'డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టం-1940 మరియు డ్రగ్స్ అండ్ మేజిక్ రెమెడీస్ చట్టం-1954 కింద ఇటువంటి ప్రకటనలపై చర్య తీసుకుని ప్రజల హక్కుల్ని, ఆరోగ్య వ్యవస్థనూ కాపాడాలి.

/ వ్యాసకర్త : జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు, సంగారెడ్డి జిల్లా/

జనవాక్యం

ప్రపంచ మానవ హక్కుల రోజు...

ప్రతి సంవత్సరం డిసెంబరు పదవ తేదీని అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము. దీని లక్ష్యము ప్రతి మనిషికీ కొన్ని హక్కులు ఉంటాయి. అవి రక్షింపబడాలి, వాటిని రక్షించుకోవాలి. ఈ విషయాన్ని మన రాజ్యాంగంలో కూడా పొందుపరచబడ్డాయి. రాజ్యాంగము అర్టికల్ 14లో చట్టం ముందు అందరూ సమానులేనని చెప్పింది. అంటే ఇక్కడ ధనిక, పేద, లింగ వివక్షత చూపరాదు.

అలాగే అర్టికల్ 15, 16, 17, 19 లలో కూడా మత జాతి, కులం, లింగం ఆధారంగా వివక్షత చూపరాదు. చెరువుల దగ్గర, బావుల వద్ద స్నానము, నీరు తోడుట లాంటి వాటి దగ్గర వివక్షత చూపరాదు. ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికి సమాన అవకాశాలుండాలి. అంటరానితనం నిషేధిస్తూ, వ్యక్తి స్వేచ్ఛను ప్రోత్సహిస్తూ, వాక్‌స్వాతంత్ర్యం కల్పిస్తూ, ఆయుధాలు ధరించకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకోవచ్చని, మన ఇష్టం వచ్చినట్లు సంఘాలు ఏర్పరచుకోవచ్చని, దేశంలో ఎక్కడైనా ఇష్టంవచ్చిన వృత్తి చేసుకోవచ్చని మనకు రాజ్యాంగం హక్కులు కల్పించింది. వీటిని కాపాడుకు నేవిధంగా ప్రజలలో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది. పౌరులందరూ శాస్త్రీయ స్ఫూర్తిని, ప్రశ్నించే తత్వాన్ని, మానవవాదాన్ని పెంచుకోవాలి, అలవరచుకోవాలి-అన్న లక్ష్యంతో ఆచరణతో ముందుకి సాగుదాం.

- నార్నె వెంకట సుబ్బయ్య

13 నుంచి హైదరాబాద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ మహాసభ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీలో డిసెంబర్ 13 నుంచి 16 వరకు ఎస్‌ఎఫ్‌ఐ 17వ అఖిల భారత మహాసభ నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ తెలిపారు. శుక్రవారం నాడిక్కడ ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాను, బిశ్వాస్‌లు మాట్లాడారు. 13న విద్యార్థి ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం మల్లు స్వరాజ్యం నగర్‌లో బహిరంగ సభ జరుగుతోందని తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మొదటి ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత ఉపాధ్యక్షుడు, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ పాల్గొంటారని తెలిపారు. అభిమన్యు, ధీరజ్, అనీస్ ఖాన్ మంచ్‌లో ప్రతినిధుల సభ జరుగుతోంది. ప్రతినిధుల సభను సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్, జస్టిస్ చంద్రు ప్రారంభిస్తారు. 25 రాష్ట్రాల నుంచి 720 మంది ప్రతినిధులు సభకు హాజరవుతారు. యుకె, ఐర్లాండ్ ఎస్‌ఎఫ్‌ఐ యూనిట్ల నుంచి, జమ్మూ కాశ్మీర్ స్టూడెంట్స్ యూనియన్, ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్, పిఎస్‌ఎఫ్ వంటి అనుబంధ సంఘాల నుండి 28 మంది ప్రతినిధులు కూడా ప్రాతినిధ్యం వహిస్తారు. క్యూబా, పాలస్తీనా, బంగ్లాదేశ్‌లకు చెందిన విదేశీ ప్రతినిధులు కూడా మహాసభకు హాజరుకానున్నారు. 13న సభకు ముసాయిదా నివేదికను ప్రధాన కార్యదర్శి సమర్పిస్తారు. 16న నూతన నాయకత్వాన్ని ఎన్నికతో మహాసభ ముగుస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో యూనిట్ల ఏర్పాటు, ముప్పై మూడేళ్ల తరువాత గుజరాత్‌లో రాష్ట్ర కమిటీ ఏర్పాడటం, జమ్మూకాశ్మీర్‌లో తొలిసారి రాష్ట్ర కమిటీ ఏర్పాడటం వంటివి తమ సంఘం సాధించిన ఘనత అని పేర్కొన్నారు. సంయుక్త కార్యదర్శులు దీప్సితా ధర్, దినీత్ డెండా, కార్యవర్గ సభ్యుడు నితీష్ నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మానంద రెడ్డి పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వాన్‌పిక్ భూములకు సంబంధించి సిబిఐ తనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలంటూ ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్ విశ్రాంత అధికారి బ్రహ్మానందరెడ్డి దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ బ్రహ్మానంద రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ ఎంఆర్‌షా, జస్టిస్ ఎస్.రవీంద్రభట్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోమంటూ బ్రహ్మానందరెడ్డి పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది.

గంగిరెడ్డి బెయిల్ విచారణ వాయిదా

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు గంగిరెడ్డి బెయిలు రద్దు పిటిషన్‌పై విచారణ సుప్రీం కోర్టు వాయిదా వేసింది. సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎస్.రవీంద్రభట్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసు పూర్తిగా వినాల్సిన అంశమని, క్రిస్మస్ సెలవుల అనంతరం చేపడతామంటూ ధర్మాసనం విచారణ జనవరి 3కు వాయిదా వేసింది.

గ్రామీణులకు చేరువగా వైద్యసేవలు : డాక్టర్ వేమిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించడమే లక్ష్యంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని ప్రజారోగ్య ,కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ వేమిరెడ్డి .రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ముంగిట్లోకి వైద్యసేవలంటే వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్‌లో వైద్యనిపుణులు, మందులు, వైద్య పరీక్షలను అందుబాటులో ఉంచడమేనని తెలిపారు. వైద్యాధికారులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు పూర్తి అంకితభావంతో తమ విధులను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 4,17,746, జనరల్ ఓపి కేసులు నమోదు కాగా, ఇందులో 2,51,851 బిపి కేసులు,1,84,214 మధుమేహ కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

దేవుడికీ రాజ్యాంగ హక్కులు ఉన్నాయి : హైకోర్టు

ప్రజాశక్తి, అమరావతి

దేవస్థానాల్లోని మూలవిరాట్టులను మరోచోట ప్రతిష్టించడానికి వీల్లేదని హైకోర్టు తీర్పు చెప్పింది. ఆగమ శాస్త్ర ప్రకారం ప్రతిష్టించిన విగ్రహాలను తీసి మరోచోట తిరిగి ప్రతిష్టించేందుకు మత సంప్రదాయాలు సమ్మతించవని చెప్పింది. పునర్ నిర్మాణం పేరుతో ఉన్న చోట నుంచి తీసి మరోచోటకు పెట్టానికి వీల్లేదని చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం తీర్పు చెప్పింది. వాటికి కూడా రాజ్యాంగపరమైన రక్షణ ఉందని గుర్తు చేసింది. గుంటూరు జిల్లా, నర్సరావుపేట మండలం, ఇస్సప్పాలెంలోని శ్రీమహంకాళి అమ్మ ఆలయంలోని అమ్మవారి విగ్రహంతోపాటు గుంజి చుక్కమ్మ ప్రతిమను కూడా మరో చోటకు మార్చేందుకు దేవాదాయశాఖ నిర్ణయం తీసుకుంది. విగ్రహాల్ని తరలించరాదని ఆ శాఖ కమిషనర్, డీసీ, ఏసీ ఆలయ ఈవోలకు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విగ్రహాల మార్పును సవాల్ చేసిన రిట్‌ను సింగిల్ జడ్జి కొట్టేయడాన్ని సవాల్ చేస్తూ చుక్కమ్మ కుమార్తె, దేవస్థానం అనువంశిక ధర్మకర్తలు యల్లంటి రేణుక, దారా నవనీతా బాయిలు అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై బెంచ్ పైవిధంగా తీర్పు వెలువరించింది.

హేతుబద్ధమైన ఆలోచనపై దాడికి ప్రయత్నం

- పుస్తకావిష్కరణలో ఏచూరి ఆరోపణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హేతుబద్ధమైన ఆలోచనను నాశనం చేయడానికి ఒక క్రమబద్ధమైన ప్రయత్నం జరుగుతోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. శుక్రవారం నాడిక్కడ ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో "ఎడ్యూకేషన్ ఆర్ ఎక్స్‌క్లూజన్?, ది ప్లైట్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్" పుస్తకాన్ని సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్, నిలుత్పోల్ బసు విడుదల చేశారు. అనంతరం సీతారాం ఏచూరి మాట్లాడుతూ విద్య ఉమ్మడి జాబితాలో ఉందని, కానీ నూతన విద్యా విధానంపై రాష్ట్రాలతో కేంద్రం చర్చించలేదని విమర్శించారు. హేతుబద్ధ ఆలోచనను దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నం జరుగుతోందని దుయ్యబట్టారు. అంగన్‌వాడీ నుంచి ఉన్నత విద్య వరకు ఈ పుస్తకం కొత్త బోధనా విధానం ప్రభావాన్ని చూపుతుందని తెలిపారు. చరిత్ర అధ్యయనాన్ని కేవలం హిందూ పురాణాల చరిత్ర, తత్వశాస్త్రాన్ని హిందూ తత్వశాస్త్రంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం ఏకకాలంలో విద్యా ప్రైవేటీకరణ, కాషాయికరణకు దారితీస్తాయని ప్రకాష్ కరత్ విమర్శించారు. ఈ పుస్తకం నూతన విద్యా విధానం ప్రమాదకరమైన మాస్టర్ ప్లాన్‌ను వెల్లడిస్తుందని, ఇది విద్యా వ్యవస్థలను ప్రీ-ప్రైమరీ నుండి పరిశోధన స్థాయికి మార్చడానికి ప్రయత్నిస్తుందని చెప్పారు. ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ రాబోయే రోజుల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలు, యూనివర్శిటీల్లో పుస్తకాన్ని ఎస్‌ఎఫ్‌ఐ ఆవిష్కరణలను కూడా నిర్వహిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ నేతలు నితీష్ నారాయణన్, దీప్సితా ధర్, లెఫ్ట్‌వర్డ్ బుక్ మేనేజింగ్ ఎడిటర్ సుధన్వ దేశ్‌పాండే మాట్లాడారు. మాజీ ప్రధాన కార్యదర్శి విక్రమ్ సింగ్, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా తదితరులు మాట్లాడారు. ఈ పుస్తకాన్ని ఎస్‌ఎఫ్‌ఐ పత్రిక స్టూడెంట్ స్ట్రగుల్, రీసెర్చ్ పబ్లికేషన్ ఇండియన్ రీసెర్చర్, లెఫ్ట్ వర్డ్ బుక్స్ సంయుక్తంగా ముద్రించాయి. ఈ పుస్తకాన్ని స్టూడెంట్ స్ట్రగుల్ ఎడిటర్ నితీష్ నారాయణన్, ఇండియన్ రీసెర్చర్ ఎడిటర్ దీప్షితా ధర్ ఎడిట్ చేశారు. లెఫ్ట్‌వర్డ్ బుక్స్ వెబ్‌సైట్ నుండి పుస్తకాన్ని కొనుగోలు చేయవచ్చు. ఈ పుస్తకంలో ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నేతలు, యువ పరిశోధకులు, ప్రముఖ మేధావులు, ప్రజాస్వామ్య ఉద్యమ నిర్వాహకులు ఐషీ ఘోష్, అజ్మల్ ఈఎ, ఎఆర్ సింధూ, ఆషిక్ అలీ తుప్పిలిక్కట్, దయాల్ పలేరి, దేబోదీప్ బెనర్జీ, దినిత్ డెంటా, ఎల్. జవహర్ నేసన్, మధు ప్రసాద్, మాలిని బట్టాచార్య, ముకులికా రాధాకృష్ణన్, పరిచయ్ యాదవ్, ప్రభాత్ పట్నాయక్, రోహన్ డిసౌజా, ఆర్. బిందు, రామ్‌దన్ సిన్హా, రామ్‌దన్ సిన్హా, సంగీతా దాస్, సోహం భట్టాచార్య, తోర్సా సాహా, వి శివదాసన్. వంటి వారి వ్యాసాలు, ఇంటర్వ్యూల సమాహారంగా ఉంటుంది.



రాజస్థాన్‌లో ఘోరం

- గ్యాస్ సిలిండర్లు పేలి ఐదుగురి మృతి
- 50 మందికి గాయాలు

జైపూర్: రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘోర ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి పెళ్లి వేడుకల్లో సిలిండర్లు పేలి ఐదుగురు మరణించగా, దాదాపు 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. జోధ్‌పూర్‌లోని భంగ్రా గ్రామంలో గురువారం రాత్రి ఓ ఇంట్లో పెళ్లి వేడుకలు జరుగుతున్నాయి. అతిథులకు వంటలు సిద్ధం చేస్తుండగా వంట గదిలో ఉన్న ఐదు సిలిండర్లు పేలాయి. దీంతో భారీగా మంటలు చెలరేగాయి. పేలుడు తీవ్రతకు ఇల్లు కొంత భాగం కూలిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. మరో 50 మంది గాయపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

'కాశ్మీరీ వాలా' ఎడిటర్ ఫహద్ షాకి బెయిల్

శ్రీనగర్ : కాశ్మీరీ జర్నలిస్ట్ ఫహద్ షా కి స్థానిక కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఆన్‌లైన్ పోర్టల్ 'ది కాశ్మీర్ వాలా' ఎడిటర్ ఫహద్‌కి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (ఎన్ఐఎ) యాక్ట్, 2008 కింద నియమించబడిన ప్రత్యేక కోర్టు బెయిల్ జారీ చేసిందని షా న్యాయవాది ఉమైర్ రోంగా ట్విట్టర్‌లో తెలిపారు. జర్నలిస్ట్‌పై జమ్ములో మరో కేసు పెండింగ్‌లో ఉందని అన్నారు. ప్రజా భద్రతా చట్టం కింద ఆయన నిర్బంధాన్ని కూడా సవాలు చేశామని, డిసెంబర్ 15 తేదీకి విచారణకు రానుందని రోంగా తెలిపారు. ఉగ్రవాదాన్ని ప్రశంసించడం, తప్పుడు వార్తలు వ్యాప్తి చేయడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రజలను రెచ్చగొట్టడం వంటి ఆరోపణలపై ఫహద్ షాను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రభుత్వం అరెస్ట్ చేసింది. షాకి వ్యతిరేకంగా జమ్ముతో పాటు పుల్వామా, షాపియాన్, శ్రీనగర్‌లలో కేసులు నమోదయ్యాయి.

పిఎం కిసాన్ నుంచి రెండు కోట్ల మంది రైతులు తొలగింపు

- దీనివల్ల కేంద్రానికి రూ.5,108 కోట్లు మిగులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పిఎం కిసాన్ పథకం నుంచి రెండు కోట్ల మంది రైతులను తొలగించారు. ఈ మేరకు టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022-2023లో 11వ విడుత (ఏప్రిల్-జూలై)లో 10,45,59,905 మంది రైతులకు లబ్ధి చేకూరితే, 12వ విడుత (ఆగస్టు-నవంబర్)లో 8,42,14,408 మంది రైతులకు మాత్రమే పిఎం కిసాన్ కింద జమ అయింది. 2,03,45,497 మంది పిఎం కిసాన్ పథకం నుంచి తొలగించబడ్డారు. ఏపిలో 4,00,316 మంది, తెలంగాణలో 3,05,425 మంది రైతులు పిఎం కిసాన్ నుంచి తొలగించబడ్డారు.

దీనివల్ల కేంద్ర ప్రభుత్వానికి రూ.5,108 కోట్లు మిగిలింది. 11వ విడుతలో రూ.22,551 కోట్లు విడుదల చేస్తే, 12 విడుతలో 17,443 కోట్లు కేటాయించింది.

12.8 శాతం పెరిగిన క్యాన్సర్ కేసులు

దేశంలో 12.8 శాతం క్యాన్సర్ కేసులు పెరిగాయని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవియా తెలిపారు. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. 2020లో 13,92,179 కేసులు నమోదు అయ్యాయని, 12.8 శాతం పెరుగుతోందని తెలిపారు.

ఐదేళ్లలో 28,572 మంది రైతు ఆత్మహత్యలు

- మొదటి రెండు స్థానాల్లో మహారాష్ట్ర, కర్ణాటక
- మూడో స్థానంలో తెలంగాణ, నాలుగో స్థానంలో ఏపి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



దేశంలో ఐదేళ్లలో 28,572 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. కేరళ ఎంపిలు సంతోష్ కుమార్, జోసి కె.మణి అడిగి ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2017 నుంచి 2021 వరకు దేశంలో 28,572 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. దేశంలో రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర (12,552) మొదటి స్థానంలో ఉండగా, కర్ణాటక (6,095) రెండో స్థానంలో ఉంది. మూడో స్థానంలో తెలంగాణ (3,055), నాలుగో స్థానంలో ఏపి (2,413) ఉంది. ఐదో స్థానంలో మధ్యప్రదేశ్ (1,226) ఉంది. 2020 జూలైలో కిసాన్ రైలును ప్రారంభించామని, 2022 అక్టోబర్ 31 వరకు 167 రూట్లలో 2,359 సేవలను అందించిందని తెలిపారు. 22 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 1,260 మండీల్లో ఈ-నామ్‌ను ప్రారంభించామని, 2022 అక్టోబర్ 31 వరకు 1.74 కోట్ల మంది రైతులు, 2.36 లక్షల మంది వ్యాపారస్తులు నమోదు చేసుకున్నారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ముంచుకొచ్చిన మాండూస్

(మొదటి పేజీ తరువాయి)

వ్యాప్తంగా 11 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. పలు లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. తీర ప్రాంతంలో సముద్రపు అలలు ఉధృతంగా ఎగిసిపడుతున్నాయి. తుపాను నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించారు. అన్ని మండలాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు. తీరప్రాంతాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్నమయ్య జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి.. పంట చివరి దశకు చేరుకున్న తరుణంలో వర్షం పడుతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

ఇళ్లకు నీటి మీటర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తామనే పేరుతో అన్ని ఇళ్లకూ నామమాత్రపు ఫీజు తీసుకుని నీటి కుళాయిలు బిగించారు. అదే సమయంలో పబ్లిక్ కుళాయిలు మొత్తం తొలగించారు. బోర్లు వేయడాన్ని నిలిపేశారు. పాడైన బోర్లను బాగు చేయించడమూ మానేశారు. ఇప్పుడు అమృత్ పథకం నిబంధనల్లోని మిగిలిన వాటి అమలుకు నిర్ణయించారు. మొదటి విడతలో 10.25 లక్షల మీటర్లు బిగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది.

ప్రజలపై పెనుభారమే బాబూరావు

నీటిమీటర్లు పెట్టడం చట్ట వ్యతిరేకం. గతంలో పెట్టాలని చూసిన సమయంలోనే సిపిఎం, ప్రజా సంఘాల పక్షంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటం చేయడంతో పాలకులు నిలిపేశారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మాత్రం వెనక్కు తగ్గేలా లేదు. అప్పుల కోసం ప్రజావ్యతిరేక షరతులు అమలు చేస్తోంది. దీన్ని పూర్తిగా అడ్డుకోవాలి. లేనిపక్షంలో ప్రజలపై పెనుభారాలు పడే ప్రమాదం ఉంది. విజయవాడలో ఇప్పటికే మీటర్లు బిగించడం మొదలుపెట్టారు. సిపిఎం పక్షంగా తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నాము. అడ్డుకుంటాము.

సమాన హక్కుల కోసం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

కె పద్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్య ఆడపిల్లల చదువుకు ఆటంకం కలిగించే విధంగా ఉందన్నారు. 3,4,5 తరగతుల తరలించడం వల్ల బాలికలు మధ్యలో చదువు మానేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.'స్వయం సహాయక గ్రూపులు-సాధికారత' అనే అంశంపై స్వతంత్ర పరిశోధకులు సీతాలక్ష్మీ(ఉషా) మాట్లాడుతూ మహిళ సాధికారత రావాలంటే వనరులపై మహిళలకు అధికారాలు ఉండేలా కృషి చేయాలని కోరారు. ఈ సెమినార్‌కు ఐద్వా నాయకులు శ్యామలమ్మ, శ్రీదేవి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఐద్వా జాయింట్ సెక్రటరీ డి శ్రీనివాసకుమారి, ఉపాధ్యక్షులు పూర్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం హెడ్ డాక్టర్ అనిత ప్రారంభించారు.

డ్వాక్రా సభ్యులపై తీర్మానం ఆమోదం

డ్వాక్రా గ్రూపులో సభ్యులు మరణిస్తే అప్పు సభ్యులు చెల్లించే విధానాన్ని రద్దు చేయాలని సదస్సు తీర్మానించింది. ఈ తీర్మానాన్ని మస్తాన్‌బీ ప్రవేశపెట్టారు. డ్వాక్రా మహిళల నుంచి బ్యాంకులు వివిధ రూపాల్లో వడ్డీలు అధికంగా వసూలు చేస్తున్నాయని దీనిని అరికట్టాలని డిమాండ్ చేసింది. సున్నావడ్డీ అని చెబుతున్నా చెల్లించిన మొత్తం రావడం లేదని తీర్మానంలో పేర్కొన్నారు.

26-28 వరకు ఎన్‌పిఆర్‌డి మూడవ మహాసభ

- ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఎన్‌పిఆర్‌డి అఖిలభారత మూడవ మహాసభ ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామపంచాయతీ పరిధిలోని సెయింట్ మేరీస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరగనుంది. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య మాట్లాడుతూ.. అనేక వికలాంగుల ఉద్యమాలకు నాయకత్వం వహించిన ఎన్‌పిఆర్‌డి అఖిలభారత మూడో మహాసభను మొదటిసారిగా రాష్ట్రంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభకు దేశవ్యాప్తంగా 500 మంది వికలాంగుల ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతున్నారని చెప్పారు. వికలాంగుల సాధికారత, సంక్షేమం, వికలాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలు వంటి అనేక అంశాలపై చర్చిస్తామని తెలిపారు. ఈ నెల 27న దేశ్‌ముఖిలోని డాక్టర్ భారతిరావు రిహాబిలిటేషన్ సెంటర్‌లో 'వికలాంగుల సంక్షేమం-సాధికారత'పై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. సెమినార్‌కు కేరళ రాష్ట్రం సోషల్ జస్టిస్ మినిస్టర్ డాక్టర్ ఆర్ బిందు, తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, మైనార్టీ, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కె వాసుదేవ రెడ్డి, పశ్చిమబెంగాల్ విద్యా శాఖ మాజీ మంత్రి, ఎన్‌పిఆర్‌డి అఖిలభారత అధ్యక్షులు కాంతి గంగూలి, ప్రధాన కార్యదర్శి మురళీధరన్ హాజరవుతున్నట్టు చెప్పారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కె వెంకట్, కోశాధికారి ఆర్ వెంకటేష్, చీఫ్ ప్యాట్రాన్ టి జ్యోతి, వైస్ చైర్మెన్ ఎండి జహంగీర్, కొండమడుగు నరసింహ, రిహాబిలిటేషన్ సెంటర్ ఇన్‌చార్జి రాజశేఖర్, నాయకులు టి వరమ్మ, స్వరూప, ప్రకాష్, బొల్లేపల్లి స్వామి, వనం ఉపేందర్, వెంకటేష్, అంజిరెడ్డి ఉన్నారు.

'విజింజం' పై చర్చలు సఫలం

తిరువనంతపురం: కేరళలో విజింజం ఓడరేవు నిర్మాణానికి వ్యతిరేకంగా జరుపుతున్న ఆందోళనలకు ముగింపు పలకడానికి నిరసనకారులు బృందం అంగీకరించింది. చర్చల్లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అలాగే విజింజం ఓడరేవు నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలనే తమ ప్రధాన డిమాండ్‌ను విరమించుకుంది. దీంతో ఓడరేవు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఓడరేవు నిర్మాణానికి వ్యతిరేకంగా గత నాలుగు నెలలుగా లాటిన్ ఆర్చ్ డియోసెస్ పూజారుల నేతృత్వంలో నిరసనలు జరుగుతున్న సంగతి తెలిసిందే.




మీకోసం

పప్పు త్వరగా ఉడకాలంటే బియ్యం నానబెట్టిన నీళ్లను పోసి ఉడికించుకోవాలి.

జీవన సౌరభం

గెలుపు గురించి అతిగా ఆలోచించొద్దు.. వచ్చిన అవకాశాన్ని సక్రమంగా ఉపయోగించుకో..

శ్రమజీవుల విలువ



హై స్కూలు గంట మోగటంతో ఆటలాడుతున్న పిల్లలంతా తరగతి గదుల వైపు పరుగులు తీశారు. స్టాఫ్ రూమ్‌లో ప్రసాద్ మాస్టరు కుర్చీలోంచి లేచారు. కిటికీ పక్కన నిలబడిన ఆయనకు పదో తరగతి గదిలోని అల్లరి చెవిలో పడింది.

విశ్వాస్ పక్కన కూర్చున్న రాజును బల్లపై నుంచి కిందకు తోశాడు. 'మురికి కాలువలు తీసే కూలివాడి కొడుకువి వచ్చి నా పక్కన కూర్చుంటావు? ఏంట్రా...! ఛీ.. ఛీ వెనక్కి పోయి కూర్చో' అంటూ హేళన చేశాడు. రాజు దిగాలుగా ముఖం పెట్టి, తల కిందకు దించుకుని, పుస్తకాలు తీసుకుని దూరంగా వెళ్లి కూర్చున్నారు. విశ్వస్ గొడవ చేస్తుంటే పిల్లలంతా బిక్క మొహాలు వేసి చూస్తుండి పోయారు. అన్ని విషయాలను వింటున్న ప్రసాద్ మాస్టర్ కిటికీ దగ్గర నుంచి ఒక్కసారిగా తరగతి గదిలోకి ప్రవేశించారు.

పిల్లలందరూ లేచి శుభోదయం సార్ అని అన్నారు. శుభోదయం పిల్లలు అందరూ కూర్చోండి.ఏంటి..! పిల్లలు ఈరోజు శ్రమ సౌందర్యం అనే మంచి పాఠం చెప్పుకుందామా! అన్నారు.

ఓ..! అలాగే సార్...

అయితే ఇంకెందుకు ఆలస్యం పాఠంలోకి వెళ్ళిపోదాం. శ్రమ లేనిదే ఉత్పత్తి లేదు. శ్రమ అంటే ఏదో ఒక పని చేయటం, కష్టం చేయటం, శ్రమించడం, అలా కష్టజీవులకు పుట్టిన పిల్లలమే మనమంతా. ఇప్పుడు మీ నాన్న వాళ్లు ఏ కష్టం చేస్తారో చెప్పండి.' అన్నారు.

పిల్లలు సిగ్గుపడుతూ మాట్లాడకుండా కూర్చున్నారు. 'మీ నాన్నలు ఏ శ్రమ చేస్తారు? సమాజ ప్రగతికి ఎంత పాటు పడుతున్నారో ఒక్కొక్కరు లేచి చెప్పండి.' అన్నారు.

దాంతో పిల్లలంతా ఒకరి తర్వాత ఒకరు లేచి చెప్పడం మొదలుపెట్టారు. రైతు అని, చేనేత కార్మికుడు అని ఒకరు, మంగలి, చాకలి, టైలర్, కార్పెంటర్, పెయింటర్ ... ఇలా పిల్లలందరూ చెప్తున్నారు. కాని రాజు నిలబడ్డాడు. నోట్లో నుంచి మాట బయటకు రావటం లేదు. దాంతో ప్రసాద్ మాస్టర్ 'చెప్పు పర్వాలేదు రాజు..' అన్నారు. దాంతో నెమ్మదిగా ' మురికి కాల్వలు తీస్తారు...' అన్నాడు.

విశ్వాస్ మరి మీ నాన్న ఏం చేస్తాడు?

' మా నాన్న సర్పంచి. 100 ఎకరాలు ఉన్నాయి. మేము ఏ కూలి పని చేయం.' అని గర్వంగా చెప్పాడు.

అప్పుడు మాస్టారు 'శ్రమజీవుల పట్ల నీకు గౌరవం లేకపోతే నువ్వు చదివిన చదువు నిరుపయోగం. శ్రమజీవులు ఓట్లు వేస్తేనే మీ నాన్న సర్పంచ్ అయ్యాడు. మీ పొలంలో వ్యవసాయం చేస్తుంది శ్రమజీవులే. విశ్వాస్! నువ్వు రోజు వాడే వస్తువులు, చెప్పులు, బట్టలు కుట్టేది. బట్టలు ఉతికి, కటింగ్ చేసేది. నీ ఇంటి చుట్టూ దుర్వాసన రాకుండా కాలువల శుభ్రం చేసేది చెత్త ఎత్తేది ఆ శ్రమజీవులే. ఎవరు పని చేయకపోయినా ఈ సమాజం ముందుకు వెళ్ళదు. అందుకే ఏ వృత్తినీ తక్కువ చేసి మాట్లాడకూడదు. అజ్ఞానంతో కాకుండా విజ్ఞానంతో ఆలోచించి గౌరవ ప్రదమైన మేధావులుగా ,శ్రామికుల జీవితాలను మార్చే పౌరులుగా మారేందుకే చదువుకుంటున్నాం. పాఠశాలకు వస్తున్నాం' అన్నారు.

ఆ మాటలకు విశ్వాస్ సిగ్గుతో తలవంచుకున్నాడు. తన తప్పు తెలుసుకుని, పశ్చాత్తాపంతో 'మాస్టర్ నన్ను క్షమించండి' అన్నాడు.

'నువ్వు హేళన చేసి మాట్లాడిన రాజును అడుగు క్షమించమని..' అన్నారు మాస్టారు.

విశ్వాస్ కళ్ళు తుడుచుకొని రాజుని కౌగిలించుకున్నాడు. 'ఇంకెప్పుడూ నిన్ను కించపరిచి మాట్లాడను' అన్నాడు. ఒక్కసారిగా విద్యార్థులంతా కరతాళ ధ్వనులు మోగించారు.

- ఎస్. కె. బాజీ సైదా
88972 82981


పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆస్తమాపై అవగాహన అవసరం



దేశంలో చెస్ట్ క్లినిక్కులకు ఆస్తమాతో వచ్చే వారి సంఖ్య 50 శాతానికి పెరిగింది. మారుతున్న ఆహారపుటలవాట్లు, వాయుకాలుష్యం వల్ల ఆస్తమాతో బాధపడేవారి సంఖ్య ముున్ముందు 10 కోట్లకు చేరవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటి ప్రకారం పట్టణ ప్రాంత వాసులకు, మహిళలకు, పెద్ద వయస్సు వారికి, ఎలర్జీ లక్షణం ఉన్నవారికి, ధూమపానం చేసేవారికి, సామాజికంగా వెనుకబడిన వారికి, కుటుంబంలో ఆస్తమా ఉన్నవారికి ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తేలింది. దీర్ఘకాలంగా ఇబ్బందులకు గురిచేసే ఈ వ్యాధిని అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య చికిత్సతో అదుపులో పెట్టుకోవచ్చు. ఈ వ్యాధి పట్ల గ్లోబల్ ఇనిషియేటివ్ ఆన్ ఆస్తమా సంస్థ ప్రతి ఏటా దీనికి సంబంధించిన నూతన చికిత్సా పద్ధతుల పట్ల అవగాహన కల్పిస్తుంది. చలికాలంలో ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఇబ్బందికి లోనవుతారు. అందుకే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం..

శరీర కణాల నుంచి ఉత్పత్తి అయ్యే వివిధ రసాయనాల వల్ల శ్వాసనాళాల్లో శ్లేష్మం జమ అవుతుంది. దాంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. దీని వల్ల దగ్గు, ఆయాసం, పిల్లికూత, ఛాతీ పట్టేసినట్టు ఉండటం జరుగుతుంది. తరచుగా తుమ్ములు, ముక్కు దిబ్బడేయడం, నీరు కారటం, కంట్లో దురద, చర్మంపై దద్దుర్లు ఎలర్జిక్ డెర్మటైటిస్, ఎక్జిమా, లాంటి చర్మవ్యాధులు వస్తాయి. శ్వాసకోశమార్గంలో వాపు, శ్వాసకోశ మార్గం కుంచించుకుపోతుంది. ఇలా దీర్ఘకాలిక శ్వాసకోశ ఇబ్బందినే ఆస్తమా అంటారు.



వీరికి చల్లగాలి (చల్లటి వాతావరణం), దుమ్ము దూళి, పొగ పడదు. ఫంగస్, గడ్డి చెట్లు, ఘాటు వాసనలు (రసాయనాలు) పీల్చలేరు. వైరల్ ఇన్‌ఫెక్షన్ల వాతావరణంలో ఇమడలేరు. శారీరక శ్రమ చేయలేరు. వంశపారంపర్యంగా, చర్మానికి సంబంధించి అలర్జీలు ఉన్న వారు ఎగ్జిమాకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. ముక్కు, గొంతు, ఛాతీ, కఫం, ఎక్స్‌రే పరీక్షల ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చు. స్పైరోమెట్రీ (శ్వాస మీటర్ ద్వారా) పరీక్ష కూడా చేయించుకోవాలి.

ఆస్తమా ఎందుకు? ఎలా వస్తుంది?

ఆస్తమా వంశపారంపర్యంగా సంక్రమించ వచ్చు. దీనినే ఎటోపి అంటారు. ఈ లక్షణాలున్న అందరిలోనూ ఎలర్జీ కానీ, ఆస్తమా కానీ రావాలని లేదు. సాధారణంగా దుమ్ము, ధూళి, డస్ట్‌మైట్, పుప్పొడి, పొగ, చలిగాలి, వైరస్, వ్యాయామం, ఉద్వేగం మొదలైనటు వంటి వాటి వల్ల ఆస్తమా వస్తుంది. శ్వాస నాళాల్లోకి నేరుగా వెళ్ళే ఏరో ఎలర్జెన్స్ ఈ వ్యాధిని కలిగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఆహారం వల్ల ఆస్తమా రావడం బహు కొద్దిమందిలోనే జరుగుతుంది. చాలా మందిలో ఆస్తమా జలుబుతో మొదలయ్యి తరువాత గొంతునొప్పి, గొంతులో నసగా ఉండడం, స్వరం మారడం జరుగుతుంది. తర్వాత దగ్గు, ఆయాసం, పిల్లి కూతగా మారుతుంది.

రాత్రి వేళల్లో ఇబ్బంది

చలిగాలి పీల్చినప్పుడు దగ్గు ఎక్కువవుతుంది. రాత్రిళ్లు దగ్గు ఆయాసంతో సరిగా నిద్ర పట్టదు. శ్వాస సరిగా అందక గాలి కోసం బయటకు వెళ్లడం, ఫ్యాన్ వేసుకోవడం చేస్తారు. నిద్రలో లేచి కూర్చోవటం చేస్తారు. ఉదయం మూడు గంటల నుంచీ ఆరు గంటల మధ్య దగ్గు, ఆయాసం ఎక్కువై ఇబ్బంది పడతారు. 24 గంటల్లో ఉదయం 3 నుండి 6 గంటల వరకు చలి అధికంగా ఉండడమే దీనికి కారణం. ఇలా రాత్రి ళ్ళ మాత్రమే ఆస్తమా ఉంటే దాన్ని నాక్టర్నల్ ఆస్తమా అంటారు.

ఒత్తిడి ఎక్కువైనా...

వ్యాయామం చేస్తున్నపుడు లేదా ఆటలు ఆడుతున్నప్పుడు మాత్రమే కొంతమందిలో ఆస్తమా లక్షణాలు కనిపిస్తాయి. దీన్నీ ఎక్సర్‌సైజ్ ఇండ్యూస్డ్ ఆస్తమా అంటారు. మరికొద్ది మందిలో దగ్గు తప్పించి ఇక ఏ ఇతర లక్షణాలు కనిపించవు. పల్మోనరీ ఫంక్షన్ టెస్ట్ (పి.యఫ్.టి.) వల్లనే వీరిలో ఆస్తమా వ్యాధిని నిర్ధారించవచ్చు. వీరికి కాఫ్ వేరియంట్ ఆస్తమా ఉన్నట్లుగా భావించాలి. అసిడిటీ, గ్యాస్ సమస్య ఉన్నవారిలో ఆస్తమా వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీరిలో మామూలు కంటే ఎక్కువ యాసిడ్ కడుపు నుంచీ గొంతులోకి వచ్చి శ్వాసనాళాల్లోకి ప్రవేశించటం వల్ల ఉబ్బసం వస్తుంది. పనుల ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారికి, మానసిక ఆందోళన, ఒత్తిడి సమస్యలు ఉన్నవారికి కూడా ఆస్తమా వస్తుంది. వీరికి కేవలం ఆస్తమా మందులు సరిపోవు. సైకియాట్రి జబ్బులకు ఇచ్చే మందులు వాడాలి.

మందులు

ఒక్కోసారి వ్యాధి తీవ్రరూపం దాల్చినవారికి నెబ్యులైజర్ ద్వారా ఈ మందులను ఇవ్వొచ్చు. వీటితో తగ్గకపోతే అమెనోఫిల్లిన్, డాక్సోపైలిన్, డెరిఫిలిన్, టెర్బ్యుటలిన్, స్టెరాయిడ్స్ ఇంజక్షన్ రూపంలో వైద్యులు ఇస్తుంటారు. అయితే వీరి శరీరంలో ఉండే ప్రాణవాయువు తగ్గకుండా ఆక్సిజన్ కూడా ఇవ్వాలి. నోటి మాత్రలు, ఇంజక్షన్ల కంటే కూడా వ్యాధిని ఇన్‌హేలర్స్ వల్ల కంట్రోల్ చేసుకుంటే మంచిది. చిన్న పిల్లలూ మందులు వాడొచ్చు. ఇన్‌హేలర్స్‌ను సరిగా వాడగలిగిన వారికి డ్రై పౌడర్ ఇన్‌హేలర్స్ లేదా మీటర్డ్ డోస్ ఇన్‌హేలర్స్‌ను స్పేసర్ ద్వారా ఇవ్వొచ్చు.

చికిత్స ఇలా ...

గత ముప్పై ఏళ్లలో శాస్త్రవేత్తలు ఆస్తమాకి కొత్త మందులు కనిపెట్టారు. వీటిని శరీరంలోకి, నేరుగా శ్వాస నాళాల్లోకి పంపించటం జరుగుతుంది. ఇలాంటి మందులను ఎయిరోసాల్స్ అంటారు. దాంతో తక్కువ మందును వాడటమే కాకుండా వ్యాధి లక్షణాల నుంచి త్వరగా ఉపశమనం కలుగుతుంది. ఈ మందులు రెండు రకాలు. వ్యాధిని నివారించే మందులు– ప్రివెంటర్స్, ఉపశమనం ఇచ్చే మందులు – రిలీవర్స్. వైద్యుల సూచన మేరకు వీటిని వాడాలి.

సీజనల్ ఆస్తమా

వర్షాకాలం, చలికాలంలో వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. దీన్ని సీజనల్ ఆస్తమా అంటారు. ఆ రుతువు మొదలవటానికన్నా ఒకటి, రెండు వారాలు ముందే ఇవి మొదలుపెట్టి కొన్ని వారాలు క్రమంగా వాడాలి. కొంతమందిలో ఉబ్బసం లక్షణాలు కొంచెం కనిపిస్తాయి. వీరు ఉపశమనమిచ్చే మందులతో పాటు నివారించే మందులను కొన్ని వారాలు క్రమం తప్పకుండా వేసుకోవాలి. వ్యాధి అదుపులోకి వచ్చిన తర్వాత మందు పరిమాణం కొద్ది కొద్దిగా తగ్గిస్తూ అతి తక్కువ డోస్‌తో వ్యాధి అదుపులో ఉండేటట్లు చూసుకోవాలి.

పిల్లలు ఎదిగేకొద్దీ ...

తల్లిదండ్రుల్లో ఒకరికి ఆస్తమా ఉంటే పుట్టే పిల్లలకూ వస్తుందని చెప్పలేం. వచ్చే అవకాశం ఎంత ఉందో, రాకుండా ఉండే అవకాశం ఉంది. పుట్టిన పిల్లల వయస్సు నుంచీ ఈ వ్యాధి వస్తుంది. వీరు ఎదిగే కొద్దీ తరచూ జలుబు, దగ్గు, ఆయాసం వస్తుంటాయి. పరుగెత్తేటప్పుడు, మెట్లు ఎక్కుతున్నప్పుడు, ఆడుతున్నప్పుడు కానీ ఆయాసం కనిపిస్తుంది. వీరికి చల్లని నీరు, ఐస్‌క్రీమ్‌లు పెట్టకూడదు. వీరిలో వ్యాధి ఏ స్థాయిలో ఉందనేది ఎక్స్‌రేలో ప్రైమరీ కాంప్లెక్స్ పరీక్షల ద్వారా తెలుస్తుంది. పిల్లల్లో పాసివ్ స్మోకింగ్ వల్ల ఆస్తమా తరచు వస్తూ ఉంటుంది. ఇంట్లోనే పొగతాగే వారు ఉంటే పిల్లలు ఇబ్బంది పడుతుంటారు. నూటికి 90 మంది పిల్లల్లో ఈ వ్యాధి 10 నుండి 12 సంవత్సరాలు వచ్చేసరికి జాగ్రత్తలు పాటిస్తూ మందులు వాడుతుంటే అదే పూర్తిగా తగ్గిపోతుంది.

ఆహారంలో అపోహలు

ఆస్తమా ఉన్న వారు అన్ని రకాల పోషక ఆహారం తీసుకోవాలి. ఆహారమే ప్రధానంగా ఉబ్బసం కలిగిస్తుందనేది అపోహ. కొన్ని రకాల సిట్రస్ జాతికి చెందిన బత్తాయి, నిమ్మ వంటి పండ్లు, చేపలు, గుడ్డు తెల్లసొన, పాలు, చాక్లెట్లు, వేరుశనగలు కొందరికి పడవు. చాలామంది తీపి, నూనె, పండ్లు, పులుపు, పెరుగు, టమాట తినడం మానేస్తారు. అయితే వీరు ఇలా మానేసిన ఆహార పదార్థాల వల్ల ఆస్తమా వస్తుందో లేదో అని పరీక్షించుకోవటం అవసరం. ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఇలాంటి పదార్థాలు తీసుకొని ఆస్తమా లక్షణాలు వస్తున్నాయో లేదో చూసుకోవాలి. ఒకటికి రెండుసార్లు అలాగ చూసుకొని వ్యాధి లక్షణాలు వస్తున్నాయి అనిపించినప్పుడు ఆ ఆహార పదార్థాలు మానేస్తే మంచిది. సాధ్యమైనంత వరకు విటమిన్లు అన్నీ అందేలా ఆహారం తీసుకోవాలి.



- డాక్టర్ శ్రీనివాస నాయక్

సంపాదన తర్వాతే పెళ్లి

68 శాతం యువత స్పందన



న్యూఢిల్లీ : ఆర్థికంగా స్థిరపడ్డాకే పెళ్లిళ్లు చేసుకుంటామని 68 శాతం మంది యువత ఓ సర్వేలో అభిప్రాయపడ్డారు. భారత్‌లో పెళ్లిళ్ల వ్యయానికి అప్పులిచ్చే 'బెట్టర్ హాఫ్' సంస్థ ఓ సర్వేను చేపట్టింది. ఈ సర్వేలో 21–35 ఏళ్లలోని 2100 మంది అభిప్రాయాలను సేకరించింది. సొంత డబ్బులతోనే పెళ్లి చేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించుకున్నామని 70 శాతం మంది యువత పేర్కొన్నారు.

పెళ్లిళ్ల కోసం అప్పులు చేయడానికి బ్యాంకులు, డిజిటల్ రుణ వేదికలను సంప్రదించనున్నామని 57 శాతం మంది అన్నారు. కేవలం 100 మంది బంధువుల మధ్యనే పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నామని 53 శాతం మంది పేర్కొనడం విశేషం. 100–250 మంది అతిథుల మధ్య వివాహం చేసుకోవాలని భావిస్తున్నామని 31 శాతం మంది తెలిపారు. 250 పైగా అతిథు లతో గొప్పగా పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నా మని 16 శాతం మంది అభిప్రాయపడ్డారు.

మైనార్టీ సంక్షేమ శాఖకు అందని నిధులు

- ఎస్ఎన్ఎలో జమకాని 212 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ మైనార్టీ సంక్షేమ శాఖకు ఆ మొత్తం అందలేదని సమాచారం. పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం నుంచి కొంత, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరికొంత నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే ఈ నిధులు అందుబాటులో లేవని మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. దీనికి సంబంధించి మొత్తం 220 కోట్లు ఇప్పటికీ గ్రీన్ ఛానల్‌లోనే ఉన్నట్లు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో విడుదల చేసేందుకు గతంలోనే ఏర్పాటుచేసిన ఈ గ్రీన్‌ఛానల్‌లో జమ చేయడమే తప్ప సంబంధిత శాఖలకు విడుదల చేయడం లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి.పిఎంజెవికె ప్రధానమంత్రి జన వికాస్ కేంద్రాస్) పథకం కింద కేంద్ర, రాష్ట్ర వాటా నిధులు పలు కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందులో విద్య, ఆరోగ్యం, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి రంగాలకు 220 కోట్లు కేటాయించారు. దీనిలో రాష్ట్ర వాటాగా132 కోట్లు, కేంద్ర వాటాగా 88 కోట్ల రూపాయలు ఉన్నాయి. అయితే ఇవి నేరుగా సంక్షేమ శాఖకు రాకుండా గ్రీన్‌ఛానల్‌లోనే ఉండిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నిధులను మైనార్టీ శాఖ ద్వారా ఖర్చు చేసేందుకు ముందుగా సింగిల్ నోడల్ ఏజెన్సీ బ్యాంకులో ఖాతాను తెరవడంతోపాటు, దానిని కేంద్ర ఆధీనంలోని పిఎఫ్ఎంఎస్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. అయితే ఎస్ఎన్ఏ ఖాతాను తెరిచినప్పటికీ అందులోకి నిధుల బదలాయిపు జరగలేదని తెలిసింది. అలాగే ఈ ఖాతాను పిఎఫ్ఎంఎస్‌కు అనుసంధానం జరగలేదని కూడా తెలిసింది.ఈ నిధులు 2020 సంవత్సరం నుంచి గ్రీన్ ఛానల్‌లోనే ఉన్నట్లు సమాచారం. అప్పటి నుంచి మొత్తం 232 కోట్లు నిధులు ఉండగా, అందులో కేవలం 12 కోట్లు మాత్రమే ఎస్ఎన్ఏ ఖాతాకు మళ్లింపు జరిగిందని, మిగిలిన 220 కోట్లు ఇంకా గ్రీన్ ఛానల్‌లోనే ఉండిపోయాయని అంటున్నారు.



ఒపి జిందాల్, సియాటెల్ యూనివర్శిటీల భాగస్వామ్యం

హైదరాబాద్ : ఒపి జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ, అమెరికాకు చెందిన సియాటెల్ యూనివర్సిటీలు కీలక ఒప్పందం చేసుకున్నట్లు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం ఉన్నత విద్యలో తమ విద్యార్థులు, అధ్యాపకులకు సరికొత్త సజనాత్మక అవకాశాలను సష్టించడానికి సహాయపడుతుందని ఒపి జిందాల్ గ్లోబల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ రాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సియాటెల్ యూనివర్శిటీ ప్రెసిడెంట్ ఎడ్వర్డో పెనాల్వర్‌తో కలిసి రాజ్ కుమార్ మాట్లాడారు. తమ ఒప్పందంలో పరస్పర సహకార పరిశోధన, ఉమ్మడి ప్రచురణలు, గ్రంథాలయ మార్పిడి, అధ్యయనం, బోధన, పరిశోధన కోసం ఫ్యాకల్టీ, విద్యార్థుల మార్పిడి తదితర అంశాలు కీలకంగా ఉన్నాయన్నారు.

డ్యూరోఫ్లెక్స్ నుంచి 'వేవ్ ప్లస్' పరుపులు

న్యూఢిల్లీ : స్లీప్ సొల్యూషన్స్ ప్రొవైడర్ అయిన డ్యూరోఫ్లెక్స్ కొత్తగా 'డ్యూరోఫ్లెక్స్ వేవ్ ప్లస్' శ్రేణి పరుపులను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇవి ఉన్నతస్థాయి పనితీరుతో కూడిన అడ్జస్టబుల్ స్మార్ట్ బెడ్ అని పేర్కొంది. తమ నూతన వెల్‌నెస్ ఉత్పాదనతో డ్యూరోఫ్లెక్స్ నాణ్యమైన నిద్రను అందించడం మాత్రమే కాకుండా ఆరోగ్యాన్ని మెరుగుపర్చేలా నూతన సాంకేతికతో వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది.

ఊరట దక్కేనా?

బంగ్లాతో చివరి వన్డే నేడు
గాయాలతో భారత్ సతమతం
ఉదయం 11.30 నుంచి సోనీలో..

చిట్టగాంగ్ :

భారత్‌కు గాయాల దెబ్బ

బంగ్లాదేశ్ పర్యటనలో టీమ్ ఇండియా ఊహించని రీతిలో గాయాల సమస్య ఎదుర్కొంటుంది. ఇప్పటికే ఆరంభ జట్టులో ఏకంగా ఏడు మార్పులు చేసిన భారత్.. చివరి వన్డేకు కెప్టెన్ రోహిత్ శర్మను సైతం కోల్పోయింది. పేసర్లు దీపక్ చాహర్, శార్దుల్ ఠాకూర్ గాయాల బారిన పడగా తుది జట్టులో నిలిచేందుకు ఇద్దరు పేసర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగేందుకు పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయి. గాయం వేధిస్తున్నా రెండో వన్డేలో గెలుపు కోసం చివరి బంతి వరకు ప్రయత్నించిన రోహిత్ శర్మ.. స్వదేశానికి చేరుకున్నాడు. అతడి స్థానంలో ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా రానున్నాడు. రోహిత్ లేని వేళ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిపై మరింత భారం పడనుంది. గత ఏడు వన్డే ఇన్నింగ్స్‌ల్లో కోహ్లి అత్యధిక స్కోరు 18. టీ20ల్లో గొప్ప ఫామ్ కనబరిచిన విరాట్.. 50 ఓవర్ల ఆటలో తడబడుతున్నాడు. నేడు విరాట్ నుంచి జట్టు మంచి ఇన్నింగ్స్ ఆశిస్తోంది. శిఖర్ ధావన్ సైతం ఫామ్‌లోకి వస్తే టాప్ ఆర్డర్ కష్టాలు తీరతాయి. శ్రేయస్ అయ్యర్ మంచి టచ్‌లో ఉన్నాడు. అతడికి తాత్కాలిక కెప్టెన్ కెఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్ సహకారం లభిస్తే భారీ స్కోరు సులువు కానుంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఈ ఏడాది పవర్‌ప్లేలో 15 వికెట్లు పడగొట్టిన మహ్మద్ సిరాజ్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సిరాజ్‌ను కొత్త బంతితో ఎదుర్కోవటం బంగ్లా టాప్ ఆర్డర్‌కు కఠిన సవాల్ కానుంది. స్పిన్నర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు కుల్దీప్ యాదవ్ జత కలువనున్నాడు. 0–2తో సిరీస్‌ను చేజార్చుకున్న భారత్.. నేడు ఊరట విజయం సాధించటంపై దృష్టి సారించింది. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై భారీ స్కోర్లపై బ్యాటర్లు కన్నేశారు.



మార్చి 3 నుంచి మహిళల ఐపీఎల్!

- ఏప్రిల్ 1 నుంచి ఐపీఎల్ 2023
- షెడ్యూల్‌పై బీసీసీఐ కసరత్తు

ముంబయి : తొలి మహిళల ఐపీఎల్ మార్చి 2న ఆరంభం కానుంది!. ఈ మేరకు బీసీసీఐ యంత్రాంగం షెడ్యూల్ కూర్పుపై కసరత్తు చేస్తోంది. ఐదు జట్లతో కూడిన మహిళల ఐపీఎల్ 2023 మార్చి 3న ఆరంభ మ్యాచ్‌తో మొదలై, మార్చి 26న టైటిల్ పోరుతో ముగియనుంది. 2023 ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్ ముగిసిన వారం రోజుల వ్యవధిలో మహిళల ఐపీఎల్ తొలి సీజన్‌కు బోర్డు ప్రణాళిక చేస్తోంది. ఫిబ్రవరి 2 నుంచి ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ దక్షిణాఫ్రికా వేదికగా జరుగనున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మార్చిలోనే పాకిస్థాన్ సైతం మహిళల పీఎస్ఎల్ తొలి సీజన్‌కు రంగం సిద్ధం చేస్తోంది. విదేశీ క్రికెటర్ల అందుబాటును సైతం దృష్టిలో ఉంచుకుని తుది షెడ్యూల్ ఖరారు చేయనున్నారు.

మీడియా హక్కులకు టెండర్లు : ఐదు జట్లతో కూడిన మహిళల ఐపీఎల్ తొలి ఐదు సీజన్లకు మీడియా హక్కులకు బోర్డు టెండర్లు పిలిచింది. టెలివిజన్, డిజిటల్, టెలివిజన్+డిజిటల్ విభాగాల్లో బిడ్డింగ్ దాఖలు చేసేందుకు ఇన్విటేషన్ టు టెండర్ (ఐటీటీ) విడుదల చేసింది. ఈ–వేలం కాకుండా బిడ్డింగ్ ప్రక్రియకు బోర్డు మొగ్గుచూపింది. మహిళల ఐపీఎల్‌లో ఐదు జట్లు 22 మ్యాచులు ఆడనున్నాయి. గ్రూప్ దశలో 20 మ్యాచులు అనంతరం టాప్–2 జట్లు ఫైనల్స్‌కు చేరతాయి. మూడు, నాల్గో స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్‌లో తలపడి ఫైనల్‌కు చేరుకుంటాయి. ప్రతి జట్టులో గరిష్ఠంగా 18 మంది క్రికెటర్లు, అందులో ఆరుగురు విదేశీ క్రికెటర్లు ఉండాలి. తుది జట్టులో ఐదుగురు విదేశీ క్రికెటర్లను ఎంచుకునే వీలుంది. ఇక మహిళల ఐపీఎల్ ఫ్రాంచైజీలకు టెండర్లను పిలిచేందుకు బోర్డు మరికొంత సమయం తీసుకునేలా ఉంది. ఐదు జోన్ల వారీగా ఫ్రాంచైజీలను అందుబాటులో ఉంచి.. అందులో అనువైన నగరాన్ని ఎంచుకునే అవకాశం ఇవ్వటం ఒక ఆప్షన్. ఐదు ఫ్రాంచైజీలను అమ్మేసి.. బోర్డు నిర్ణయించిన నగరాల్లో మ్యాచులను నిర్వహించటం మరో ఆప్షన్. దీనిపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఏప్రిల్ 1 ఐపీఎల్ 2023? : మెన్స్ ఐపీఎల్ 2023 ఏప్రిల్ 1న ఆరంభం కానుంది. జూన్ ఆరంభంలో ఇంగ్లాండ్, ఐర్లాండ్ టెస్టు, ఆ వెంటనే ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, యాషెస్ సిరీస్ ఉండటంతో.. ఏప్రిల్ 1న షురూ చేసి మే ఆఖర్లో ముగించేందుకు కసరత్తు చేస్తోంది. విదేశీ క్రికెటర్ల అందుబాటును గమనంలో ఉంచుకుని సీజన్ షెడ్యూల్ రూపొందించను న్నారు. పది జట్ల మెన్స్ ఐపీఎల్ వచ్చే సీజన్ నుంచి పాత పద్ధతిలో (ఇంటా, బయటా) జరుగనున్న సంగతి తెలిసిందే.

ఫార్ములా రేసుకు వేళాయే

నేటి నుంచి ఇండియన్ రేసింగ్ లీగ్ ఫైనల్స్

హైదరాబాద్ : ఫార్ములా రేసుకు మరోసారి హైదరాబాద్ ముస్తాబైంది. ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) స్ట్రీట్ సర్క్యూట్ ఫైనల్స్ నేటి నుంచి ఆరంభం కానున్నాయి. మూడు రౌండ్ల పాటు జరిగే తుది రేస్‌లో శనివారం ఒక రేసు జరుగనుంది. ఆదివారం చివరి రెండు రేసులు నిర్వహించనున్నారు. హుస్సేన్‌సాగర్ తీరంలో 2.7 కిలోమీటర్ల ప్రత్యేక ట్రాక్ ఫార్ములా రేసు కోసం సిద్ధమైంది. నవంబర్ 20న హైదరాబాద్‌లో జరగాల్సిన తొలి రౌండ్ పోటీలు రద్దు కావటంతో.. ఫైనల్స్‌కు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా ఏర్పాట్లు చేశారు.

ముందంజలో బ్లాక్‌బర్డ్స్ : చెన్నైలో జరిగిన రెండు అంచెల పోటీల అనంతరం హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ ముందంజలో కొనసాగుతోంది. ఆరు రేసుల్లో ఏకంగా నాలుగింట అగ్రస్థానంలో నిలిచిన హైదరాబాద్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌కు చేరువగా ఉంది. హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ 206.5 పాయింట్లతో టాప్‌లో నిలువగా.. గాడ్‌స్పీడ్ కోచి 161.5 పాయింట్లుతో రెండో స్థానంలో నిలిచింది. స్పీడ్ డెమాన్స్ ఢిల్లీ (94), గోవా ఏసెస్ (93), బెంగళూరు స్పీడ్‌స్టర్స్ (89.5), చెన్నై టర్బోరైడర్స్ (81) చివరి మూడు రౌండ్లలో పోల్ పొజిషన్ సాధిస్తే చాంపియన్‌షిప్ రేసులో నిలిచే అవకాశం ఉంది.

'ప్రాజెక్ట్-కె' సెట్‌లో



ప్రభాస్, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ప్రాజెక్టు కె'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతుంది. నెలలు గడుస్తున్నా ప్రభాస్‌కు సంబంధించిన ఒక్క ఫోటోను కూడా రిలీజ్ చేయలేదని అభిమానులు మేకర్స్‌పై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సెట్‌లోకి లెజండరి సంగీత దర్శకుడు శ్రీనివాస్ వచ్చారు. ఆయనతో కలిసి ప్రభాస్ ఓ ఫోటో దిగి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. సై–ఫై జోనర్‌లో టైం ట్రావెల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. కాగా సంగీతం శ్రీనివాస్, నాగ్ అశ్విన్‌కు కథా చర్చలు, పలు విషయాల్లో సహాయం చేస్తున్నారు. అందుకే సెట్‌కు వచ్చినట్లు సమాచారం.హీరోయిన్ దీపికా పదుకొనే నటిస్తుంది. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు.

'పదరా పదరా...' పాట విడుదల



డాక్టర్ రాజేంద్రప్రసాద్, సోనియా అగర్వాల్, పథ్వీరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'శాసనసభ'. రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్యే నారాయణస్వామిగా నటిస్తున్నారు. వేణు మడికంటి దర్శకత్వంలో తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో తెరకెక్కుతుంది. ప్రమోషన్లో భాగంగా చిత్రం నుంచి 'పదరా పదరా ...' లిరికల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. రవిబస్రూర్ కంపోజ్ చేసిన ఈ పాటను కిన్నల్ రాజ్, సంతోష్ వెంకీ రాశారు. శ్రీ కృష్ణ, సాకేత్ కొమండూరి పాడారు. 'లోకం మారదురా నీ మాటకీ..'.. అంటూ సాగుతున్న ఈ పాట అందరినీ ఆలోచింపజేస్తూ.. స్ఫూర్తి నింపేలా సాగుతుంది. సాప్‌బ్రో ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తులసీరామ్ సప్పని, షణ్ముగమ్ సప్పని చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కే రాఘవేంద్రరెడ్డి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68